ఆంధ్రజ్యోతి

andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.3 । కనిష్ఠం 25.2



ఆదిలాబాద్

జిల్లా వార్తలు

3

సోమవారం 1 ఏప్రిల్ 2024



● సోనాపూర్‌లో పని చేయని జీఎల్ఎస్ఆర్, బోర్‌బావి



● వాగులో నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్న కోలాం బొజ్జిగూడా గిరిజన మహిళలు





● సోనాపూర్‌లో అలంకార ప్రాయంగా ఉన్న నీటి ట్యాంకు

ఏజెన్సీలో.. దాహం..దాహం!

- జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాల్లో తాగునీటి అవస్థలు
- ఫలితమివ్వని మంచినీటి పథకాలు
- అలంకారప్రాయంగా నీటి ట్యాంకులు
- అడుగంటిపోతున్న భూగర్భ జలాలు
- గుక్కెడు నీటి కోసం వాగులు, వంకలకు..
- వెంటాడుతున్న వేసవి కష్టాలు
- ఫలితమివ్వని మిషన్ భగీరథ పైప్‌లైన్‌లు
- పథకం అమలులో నిధుల దుర్వినియోగం!
- దశాబ్దాలు గడిచిపోతున్నా.. ఆదివాసీ, గిరిజనులకు తప్పని తిప్పలు

ఉట్నూర్, మార్చి 31: జిల్లాలో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మారుమూల గ్రామాలకు మంచినీటి పథకాలు ఏర్పాటు చేసి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తామని ప్రభుత్వాలు చేసిన భగీరథ ప్రయత్నాలు ఫలించలేదు. దశాబ్దాలు కావొస్తున్నా.. గిరిజన గ్రామాల ప్రజలకు మంచినీటి అవస్థలు తప్పడం లేదు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైప్‌లైన్‌లు సైతం గిరిజనుల దాహార్తిని తీర్చడం లేదు. ఫలితంగా ప్రతియేటా వేసవి కాలంలో వాగుల నుంచి నీటి అవసరాలను గిరిజనులు తీర్చుకుంటున్నారు. ఏజెన్సీ ప్రాంతాలలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, గాదిగూడ, నార్నూర్, సిరికొండ తదితర మండలాల్లో ఉన్న గిరిజన గ్రామాల ప్రజలకు మిషన్ భగీరథ నీరు అంతంత మాత్రమే అయ్యింది.

తాగునీటి కోసం ఇబ్బందులు

ఉట్నూర్ మండలంలోని తేజాపూర్, హీరాపూర్, సోనాపూర్, దొంగచింత, కుమ్మరికుంట, రాజులమడుగు, ఎర్రగుట్ట, ఉమాపతికుంట, గంగాపూర్, వంకతుమ్మ, లక్కేటిపేట, బీర్సాయిపేట్, దంతనపల్లి, నర్సాపూర్(జె), రామ్‌లింగంపేట, ఉట్నూర్, పాత ఉట్నూర్, తాండ్ర, షాంపూర్, ఏందా, చప్రాల, గుట్టగూడా, రాంపూర్, రాంజిగూడ, లోడ్డిగూడ, గొట్టిపటార్, గోండు గొట్టిపటర్, సుంగుగూడ, దంతనపల్లి, నాగాపూర్, జండగూడ, ధర్మాజిపేట్, బీర్సాయపేట కోలాంగూడ, గొండుకొత్తగూడతో పాటు తదితర గ్రామాలలో తాగునీటి కోసం సానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా నార్నూర్ మండలంలోని చోర్‌గాంవ్, కోలాంగూడ, సుంగాపూర్‌తో పాటు తండాలలో మొత్తం 200 కుటుంబాలు ఉండగా.. ఒకే ఒక్క బోరుబావిపై ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. భీంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కోలాం బొజ్జిగూడలో 15 కోలాం గిరిజన కుటుంబాలు జీవిస్తుండగా.. మంచినీటి సౌకర్యం లేకపోవడంతో కిలోమీటర్ దూరంలో ఉన్న వ్యవసాయ క్షేత్రంలోని బావుల నుంచి స్థానిక ఆదివాసీ గిరిజనులు బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్నారు. గాదిగూడ మండలంలోని కుండి శేకుగూడ, రాంపూర్, మధురతండా, ఇంద్రవెల్లి మండలంలోని గట్టేపల్లి, దొడందా, సాలెగూడ, పాఠాగూడ, మామిడిగూడ(బి) ప్రాంతాలలో ప్రజలు మంచినీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వెక్కిరిస్తున్న పథకాలు

రూ.కోట్లతో మంచినీటి ట్యాంకులు నిర్మించినా.. ప్రయోజనం లేక అలంకార ప్రాయంగా మారిన మంచినీటి పథకాలు ప్రజలను ఎక్కిరిస్తున్నాయి. ఒక్కొక్క గ్రామానికి రూ.10లక్షల వ్యయంతో మంచినీటి ట్యాంకులు నిర్మించినా.. గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు మిషన్ భగీరథ పథకం ద్వారా కొమురంభీం జిల్లాలోని అడ ప్రాజెక్టు నుంచి ఉట్నూర్ ఏజెన్సీలోని గిరిజన గ్రామాలకు ఏర్పాటు చేసిన పైపులైన్లు లీకేజీలు ఏర్పడి సక్రమంగా మంచినీరు అందడం లేదు. ఇంటింటికీ మంచినీరు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విధంగా గ్రామాలలో పైపులైన్లు వేసి నల్లాలు బిగించినప్పటికీ.. ఈ నల్లాల్లో చుక్కనీరు రావడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఉట్నూర్ పట్టణంలోని కేవలం ప్రధాన రహదారి గుండా మాత్రమే ఉన్న ప్రజలకు భగీరథ నీరు అందుబాటులోకి వచ్చినా.. పట్టణంలోని మిగత ప్రజలకు భగీరథ నీరు రావడం లేదు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమీపంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మంచినీటి పథకం ద్వారా ప్రజలకు నీరు అందడం లేదు. అలాగే ఎన్టీఆర్‌నగర్, శాంతినగర్, బోయవాడ, కొమ్ముగూడ, ప్రాంతాలలో మిషన్ భగీరథ నీరు అందక పోతుండడంతో పేద ప్రజలందరూ బోరుబావులపైనే ఆధారపడి కాలం నెట్టుకు వస్తున్నారు.

బోరుబావుల తవ్వకం

అదేవిధంగా, ఉట్నూర్ మండలంలోని ఎర్రగుట్ట పీవీటీజీ గిరిజనులకు తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని ఐటీడీఏ పీవోకు మొర పెట్టుకోవడంతో ప్రాజెక్టు అధికారి ఆ గ్రామంలో సత్వరంగా బోరువేసి మంచినీరు అందించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. తాండ్ర గ్రామంలో ఉన్న బోర్లు పని చేయకపోవడంతో పాటు మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ప్రజల కోరిక మేరకు గ్రామ పంచాయతీ అధికారులు శనివారం 300 అడుగుల వరకు బోరు వేసినా నీరు పడలేదు. దీంతో 400 అడుగులు వేసి నీరు వచ్చేవరకు బోరు వేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నీటి ఎద్దడి ఉన్న గ్రామాలలో ట్యాంకర్‌ల ద్వారా నీరు అందించి ప్రజల కష్టాలు తీర్చాలని ఆదేశిస్తున్నా.. అక్కడక్కడ కొందరు అధికారులు మాత్రమే కలెక్టర్ ఆదేశాలు పాటిస్తున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా పలుచోట్ల మంచినీటి పథకాల అమలులోనూ నిధుల దుర్వినియోగం జరిగినట్లు స్థానికులు ఆరోపించడం గమనార్హం. ఇంకా వేసవి ఎండలు మరింత ముదరక ముందే ప్రజల తాగునీటి కష్టాలు తీర్చాలని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



● గిరిజన గ్రామాల్లో నీళ్లు అందించని నల్లాలు

ముందుచూపులేని అధికారులు

: రాధామోతిరామ్, మాజీ సర్పంచ్, బాలాన్‌పూర్



అధికారులకు ముందుచూపు లేకపోవడం వల్లనే గిరిజన గ్రామాలలో ప్రజలు తాగేనీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ గ్రామమైన బలాన్పూర్లో ట్యాంకు నిర్మించిన పైపులైన్లు పని చేయడం లేదు. ఫలితంగా గ్రామంలో రెండు బోర్లు ఉన్నప్పటికి వాటి ద్వారానే మంచి నీటి అవసరాలు తీర్చుకుంటున్నాం.

స్థానిక వ్యవసాయ క్షేత్రంలోని బావి నీరే మాకు దిక్కు

: జుగాదిరావు, స్థానికుడు, సోనాపూర్ గ్రామం



మా గ్రామంలో జీఎల్ఎస్ఆర్ ఉన్నప్పటికీ.. సంబంధిత శాఖ అధికారులు రూ.10 లక్షలు వెచ్చించి కొత్త ట్యాంకు నిర్మించారు. అయినప్పటికీ అది అలంకార ప్రాయంగానే మిగిలి పోయింది. గ్రామంలో ఇంటింటికీ నల్లాలు బిగించినా.. చుక్కనీరు రావడం లేదు. ఉన్న బోర్లు సైతం పని చేయక పోవడంతో గ్రామస్థులందరూ వ్యవసాయ క్షేత్రంలోని బావి నీరు తాగుతున్నారు.

ట్యాంకు ఉన్నా.. ఫలితం సున్నా..

: భీమ్‌రావు, స్థానికుడు, తేజపూర్ గ్రామం



మా ఊరు తేజాపూర్ గ్రామంలో మిషన్ భగీరథ పథకం కింద అధికారులు మంచినీటి ట్యాంకు నిర్మించినా.. ఫలితం లేదు. గ్రామంలో ఇంటింటికీ నల్ల నీరు రావడం లేదు. నీరు కావాలనుకునే ప్రజలు ట్యాంకు వద్దకే వెళ్లి బిందెలతో తెచ్చుకోవాల్సి వస్తుంది. గ్రామంలో ఉన్న బోర్లు పని చేయడం లేదు.

బోర్లు మరమ్మతులు చేయిస్తున్నాం

: సురేందర్, ఏఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ



మిషన్ భగీరథ పథకం నీరు అందుబాటులో లేని గ్రామాల ప్రజల కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. దీనిలో భాగంగా స్థానిక బోర్లకు మరమ్మతులు చేయించి మంచినీరు అందించే ప్రయత్నాలు చేస్తున్నాం. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో ఎప్పకప్పుడు బోరు బావులకు మరమ్మతులు చేయిస్తున్నాం.

సంక్షిప్త సమాచారం



ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన

జైనథ్, మార్చి 31: మండలంలోని కూర గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉందని కూర గ్రామస్థులు తెలిపారు. నూతనంగా నిర్మించిన ఈ ఆలయంలో శివ పార్వతులు, గణేషుడు, సుబ్రమణ్య స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం కూర గ్రామంలోని పలు జంటలతో మహా యజ్ఞం నిర్వహించారు. ఈ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి గొల్లపల్లి శ్రీధరాచార్యులు, గొల్లపల్లి రామనందాచార్య స్వాములు పాల్గొననున్నారు. ఈ మహా యజ్ఞ నిత్య హోమంలో ఎంపీపీ ఎం.గోవర్ధన్, గ్రామ సర్పంచ్ అడ్డి లతవెంకట్‌రెడ్డి, కూర గ్రామ వీడీసీ చైర్మన్ రాజశేఖర్, గ్రామపెద్దలపై వెంకట్‌రెడ్డిలతో పాటు కూర గ్రామ ప్రజలు మహిళలు భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నేరడిగొండ, మార్చి 31: మండల కేంద్రంలో ఉన్న వేంకటేశ్వర స్వామి 8వ వార్షికోత్సవం మహోత్సవంలో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. వీరితో పాటు మండల నాయకులు, కార్యకర్తలు అభిమానులున్నారు.

ఘనంగా ఈస్టర్ పండుగ

ఉట్నూర్, మార్చి 31: మండలంలో ఆదివారం క్రిస్టియన్‌లు ఘనంగా ఈస్టర్ పండుగను జరుపుకున్నారు. గుడ్‌ఫ్రైడే రోజున కలవరి గుట్టపైన శిలువ వేయబ డిన ఏసుప్రభు ఆదివారం పునర్జన్మతో ఈ లోకం లోకి తిరిగి వచ్చాడని ఆనందంతో క్రిస్టియన్‌లు ఆదివారం ఉదయం కొవ్వొత్తులు వెలిగించి పట్టణంలో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు.

'ఉద్యోగులుగా గుర్తించాలి'

నేరడిగొండ, మార్చి 31: టోల్‌ప్లాజాల్లో పని చేస్తున్న కార్మికులందరిని నేషనల్ హైవే ఆథారిటి ఆఫ్ ఇండియా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. రోల్‌మామడ టోల్‌ప్లాజా కాంప్లెక్స్‌లో టోల్‌ప్లాజా యూనియన్ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ టోల్‌ప్లాజాల్లో పని చేస్తున్న సిబ్బందిని నేషనల్ హైవే ఆథారిటి ఆఫ్ ఇండియా ఎన్‌హెచ్ఏఐ ఉద్యోగులుగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ ఉద్యోగభద్రత కల్పించాకే టీవోటీ (టోల్ ఆపరేట్ ట్రాన్స్ఫర్) పద్ధతిని అమలు చేయ్యాలని, సిబ్బందికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఏప్రిల్ 8న నిర్వహించనున్న టోల్‌ప్లాజా యూనియన్ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనాల మల్లేష్, టోల్‌ప్లాజా యూనియన్ అధ్యక్షుడు నక్క లక్ష్మణ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు మరువలేనివి

● పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 31: ఉమ్మడి ఆదిలాబాద్ ప్రజలు ప్రశాంతంగా జీవనం సాగించడానికి ఒకప్పటి పోలీసులు చేసిన విశేషమైన కృషి కారణమని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం తెలిపారు. ముగ్గురు అధికారుల ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ పాల్గొని వారిని సన్మానించారు. కాగా, పి.రూప్‌సింగ్‌నాయక్ ఏఎస్సై ట్రాఫిక్ పోలీసు స్టేషన్ 1989 బ్యాచ్, రాథోడ్ పరశురాం నాయక్ హెడ్‌కానిస్టేబుల్ బేల 1989 బ్యాచ్, కె.అశోక్ హెడ్‌కానిస్టేబుల్ పీసీఆర్ 1990 బ్యాచ్‌కు చెందిన అధికారులు ఉద్యోగ విరమణ చేయడంతో ఎస్పీ వారికి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఆ తర్వాత వారి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో జిల్లా ఎస్పీ సాదరంగా ఇంటికి సాగనంపారు. అంతకుముందు ఎస్పీ మాట్లాడుతూ అడవుల జిల్లా ఆదిలాబాద్‌లో సుదీర్ఘకాలం పాటు పోలీసు వ్యవస్థకు వారు చేసిన సేవలు మరవలేనివని గుర్తు చేశారు. ఒకప్పటి పోలీసు వ్యవస్థలోని సిబ్బంది సంఘ విద్రోహ శక్తులతో నిరంతరం పోరాడుతూ ప్రశాంతమైన వాతావరణాన్ని సాధించడానికి కృషి చేశారని తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కుటుంబ సభ్యులతో శేష జీవితాన్ని గడపాలని సూచించారు. ఇందులో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేంద్రరావు, సీసీ దుర్గం శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సభ్యులు గిన్నెల సత్యనారాయణ, చిందం దేవిదాస్, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● 'హెడ్ కానిస్టేబుల్ కుటుంబాన్ని ఆదుకుంటాం'

గుడిహత్నూర్: మహాశివరాత్రి సందర్భంగా నేరడిగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుంటాల జలపాతం వద్ద విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ కె.మార్కండేయ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా పోలీసు శాఖ తరఫున అన్నివిధాలుగా ఆదుకుంటామని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం అన్నారు. మండలంలోని సీతాగొంది‌కి చెందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులను ఆదివారం ఎస్పీ పరామర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 2000 సంవత్సరం కానిస్టేబుల్ బ్యాచ్‌కు సంబంధించిన కె.మార్కండేయ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేయాలనే ఉద్దేశంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న మిలీనియం కానిస్టేబుల్ బ్యాచ్ అసోసియేషన్ ద్వారా రూ.రెండు లక్షలు, జిల్లా వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున రూ.50 వేల చెక్కును ఎస్పీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, రవి, సుభాష్, ప్రేమ్, సంపత్, ధర్మపాల్, శ్రీనివాస్, రమేష్, సత్యం, ఎం.దయాకర్, మోహన్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చెక్కును అందజేస్తూ..

ప్రాజెక్టు నిర్మాణానికి కృషి : ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, మార్చి 31: ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్(జె) ప్రాంతంలో ఉన్న వాగులో వర్షపునీరు వరద పాలవుతున్నందునప్రజలకు ప్రయోజనం కల్పించేందుకు ప్రాజెక్టు నిర్మాణం చేపడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని దంతన్‌పల్లిలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధితో పాటు పేదల సంక్షేమం కోసం కృషి చేస్తోందని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రతీ కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి కండువాకప్పి పార్టీలో సాదారంగా ఆహ్వానించారు. అనంతరం కార్యకర్తలు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి చంద్రయ్య, టీ-పీసీసీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ మోబిన్, మాజీ సర్పంచ్ భీమన్న, గ్రామ అధ్యక్షుడు షరీఫ్, అర్బాజ్, తదితరులు పాల్గొన్నారు.

'టోల్‌ప్లాజా టాక్స్ మినహాయింపు ఇవ్వాలి'

బోథ్, మార్చి 31: నేరడిగొండ మండలంలోని కిష్టాపూర్ వద్ద ఏర్పాటు చేసిన టోల్ ప్లాజా వద్ద చెల్లించే టాక్స్‌ను బోథ్ ప్రాంత ప్రయాణికులకు మినహాయింపు ఇవ్వాలని బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు జి.రాజు యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. బోథ్ నుంచి నిర్మల్ ఆపై పట్టణాలకు ప్రయాణించే వారు నేరడిగొండ టోల్ ప్లాజా మీదుగా జాతీయ రహదారిపైన కేవలం ఏడు కిలో మీటర్లు మాత్రమే ప్రయాణిస్తారు అన్నారు. అయితే ఈ ఏడు కిలో మీటర్ల దూరానికి ఆర్టీసీలో టోల్ టాక్స్ వసూలు చేస్తున్నారని, వచ్చిపోయే వాహనాలకు ఒక్క కారుకు ఒక వంద 50 రూపాయలు రానుపోను చార్జి వసూలు చేస్తున్నారన్నారు. కేవలం ఏడు కిలో మీటర్లు ప్రయాణిస్తే కిలో మీటర్‌కు సరిపడా టాక్స్ వసూలు చేయాలని ఆయన అధికారులను కోరారు. లేనట్లయితే ప్రైవేట్ వాహనాల వారితో కలిసి ఆందోళన కార్యక్రమాలను చేపడతామన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 31: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమర్థపాలనకు, బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులై బీజేపీ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన టౌన్ వైస్ ప్రెసిడెంట్ దివిటి రాజు, 40వ వార్డు ప్రెసిడెంట్ అనిల్, మాజీ ఎంపీటీసీ నరేందర్, అశోక్, పలువురు నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు.

● పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్ అర్బన్: విద్యాదానం మహాదానం అని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. స్థానిక మహాలక్ష్మివాడలోని అరుణోదయ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ఉత్సాహాన్ని ఇచ్చే ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం జోలికొస్తే ఖబడ్దార్'

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 31: బీజేపీ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వం జోలికొస్తే ఖబడ్దార్ అని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించుకునేందుకు ఏప్రిల్ 1న జిల్లా కేంద్రంలోని రత్నాగార్డెన్‌లో నియోజకవర్గ విస్తృత స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సత్తు మల్లేష్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్క, తదితరులు వస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమతో అధికార పార్టీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని, తాము తల్చుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వారం రోజుల్లో కూలుస్తామని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

కాగా, ఆదివారం ప్రజాసేవ భవన్ క్యాంపు కార్యాలయంలో కోలిపుర, శాంతి నగర్‌కు చెందిన కాలనీ వాసులు, యువకులు పెద్దఎత్తున పార్టీలో చేరగా వారికి కంది శ్రీనివాస్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



పట్టుకున్న మద్యం సీసాలతో సీసీఎస్ సీఐ పెద్దపల్లి చంద్రశేఖర్, సిబ్బంది

గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

● జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీసీఐ పోలీసుల దాడులు

● సిరిచెల్మ గ్రామంలో బహిరంగంగా విక్రయిస్తున్న రూ.34వేల మద్యం సీసాల స్వాధీనం

ఇచ్చోడ, మార్చి 31: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా మారుమూల గ్రామాల్లో 24 గంటలు గొలుసు దుకాణాల ద్వారా మద్యం అందుబాటులో ఉంటుంది. మద్యం దుకాణాలు అందుబాటులో లేనపుడు మండల కేంద్రానికి సమీపంలో ఉన్న గ్రామాలకు ఎప్పుడు వెళ్లిన దొరుకుతుందన్న భరోసా మందుబాబుల్లో ఉంది. ఇదే ఇచ్చోడ మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల కోడ్ నిబంధనలు ఉన్నా.. మద్యం విచ్చలవిడిగా దొరుకుతుంది. గ్రామాల్లోని కిరాణాలు, శీతలపానీయాల దుకాణదారులు ఎక్కువగా ఈ వ్యాపారాన్ని ఎంచుకుంటున్నారు. జిల్లా ఏస్పీ ఆదేశాల మేరకు ఆదివారం ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామంలో సీసీఎస్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సీసీఐ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా రెండు చోట్లలో బహిరంగంగా బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న సురేందర్‌గౌడ్, కేశవ్‌గౌడ్‌ల వద్ద నుంచి రూ.34 వేల మద్యం సీసాలను పట్టుకుని స్వాధీన పరుచుకున్నట్లు ఆయన తెలిపారు. పట్టుకున్న సీసాలను ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌కు అప్పగించి కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అక్రమంగా మద్యం అమ్మకాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

● ప్రేక్షకపాత్రలో ఆబ్కారీశాఖ!!

కాగా, మారుమూల గ్రామాల్లోని గొలుసు దుకాణాలను అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ ప్రేక్షకపాత్రను పోషిస్తున్నాయి. ఆబ్కారీ అధికారులు తరచూ దాడులు చేసి కేసులు నమోదు చేయాల్సి ఉన్నా.. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నా పట్టింపు కరువైంది.

'కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి'


నేరడిగొండ, మార్చి 31: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సత్తు మల్లేష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇందులో మండల కన్వీనర్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ప్రఫుల్‌చందర్ రెడ్డి, సీనియర్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, వకీల్ శంకర్, తదితరులున్నారు.

'ఆత్రం సక్కు గెలుపు కోసం పాటుపడాలి'

ఇంద్రవెల్లి, మార్చి 31: ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు కోసం కార్యకర్తలు పాటుపడాలని పార్టీ రాష్ట్ర నాయకుడు బాధవత్ పూర్ణ చందర్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని దస్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కోయిలపాండ్రి గ్రామంలో గ్రామస్థులతో సమావేశమై మాట్లాడారు. గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని అన్నారు. ఇందులో బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్, పూర్కు చిత్రు, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

సోమవారం	మంగళవారం
ఇఫ్తార్ సా.6.35	సహర్ ఉ.4.48



ఉపవాసమనేది ఒక కవచం లాంటిది. దీని ద్వార దాసుడు పుణ్య ఫలాలు పొందడంతో పాటు నరకాగ్ని నుంచి కాపాడబడతాడు.

ఇప్ప పువ్వు సేకరణలో గిరిజనులు


ఇప్ప పువ్వులను సేకరిస్తున్న దృశ్యం

ఇంద్రవెల్లి, మార్చి 31: అడవిలో ఇప్పపువ్వు సేకరణ మొదలైంది. ఏ చెట్టు కింద చూసిన రాలిన ఇప్పపువ్వు దర్శనమిస్తున్నాయి. ఈ పూలను ఇప్పలడ్డు వంటి తదితర ఆహార పదార్థాల్లో వినియోగిస్తుంటారు. దీంతో గూడేల్లోని గిరిజనులు పిల్లా పాపలతో మసకమసక చీకటిలోనే అడవికి చేరుకుంటున్నారు. ఇప్పచెట్టు కింద రాలిన పూలను సేకరించి ఇంటికి తీసుకొస్తున్నారు. మండలంలోని పలు ఆదివాసీ గిరిజన గ్రామాల్లో గిరిజనులు ఇప్పపువ్వులను సేకరిస్తున్నారు. వేసవి సిజన్‌లో లభించే ఇప్పపువ్వులను గ్రామస్థులు సేకరించి జీసీసీ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలతోపాటు స్థానిక వ్యాపారులకు విక్రయిస్తుంటారు. వేకువ జామున లేచి దట్టమైన అడవుల్లో చెట్టుచెట్టుకు తిరుగుతూ ఇప్పపువ్వ సేకరించి ఆదాయాన్ని పొందుతున్నారు.

పక్షుల కోసం నీటి తొట్టి ఏర్పాటు


పక్షుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టి


భీంపూర్, మార్చి31: ఎండ తీవ్రతకు మనుషులతో సహా పక్షులు కూడా ఇబ్బంది పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వాటి దామరం గురించి ఆలోచించేవాడు వేలలో ఒకరుంటారు. అందులోనే ఒకరు భీంపూర్ మండలం అంతర్‌గాంకు చెందిన ఆదర్శ రైతు సావాయి స్వామి. ఈయన కొన్నేళ్లుగా తన ఇంటి వద్ద గల చెట్లపై ఎండాకాలం పక్షుల కోసం నీటి తొట్టిలు ఏర్పాటు చేస్తున్నాడు. అక్కడ కొన్ని ఆహార గింజలు ఉంచుతున్నాడు. ఈ ఎండకాలం కూడా చెట్లపై నీటి తొట్టిలు ఏర్పాటు చేయగా పక్షులు చెట్టుపై వాలి ఎంచక్కా దాహం తీర్చుకుంటున్నాయి.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జాన్సన్ నాయక్

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ఇంద్రవెల్లి, మార్చి31: చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు భూక్య జాన్సన్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మండల కోఆప్షన్ సభ్యులు మీర్జా జిలానీబేగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతున్నదని, నిత్యం పరిసర గ్రామాల నుంచి మండల కేంద్రానికి వివిధ పనుల కోసం ప్రజలు వస్తుంటారని, వారి దాహార్తిని తీర్చడానికి ఇలాంటి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్య క్షుడు సోన్ కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి వాగ్మార్ కామరాజ్, మాజీ ఎంపీటీసీ భవలే సత్యానంద్, విజయ్ పాల్గొన్నారు.





● ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన పట్టణం

● జిల్లాకేంద్రంలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి



● ముఖానికి రూమాలు, స్కార్ఫ్ ధరించి వెళ్తున్న వాహనదారులు

భానుడి.. భగభగలు

- జిల్లాలో అత్యధికంగా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతల నమోదు
- ఎండల తీవ్రతకు తీవ్ర ఉక్కపోతలు
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం
- ఉదయం 9గంటల నుంచే బయటకు వెళ్లేందుకు జంకుతున్న వైనం
- వేగంగా పడిపోతున్న భూగర్భ జలమట్టం
- గత పక్షం రోజులుగా పెరిగిన విద్యుత్ వినియోగం.. విద్యుత్ కోతలు
- జిల్లాపై విపరీతంగా కొనసాగుతున్న వడగాలుల ప్రభావం
- మున్ముందు మరింత అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యాధికారులు
- జిల్లావ్యాప్తంగా రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతల నమోదు

ఆదిలాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే భానుడి భగభగలకు జనం ఉక్కిరిబిక్కిర వుతున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం నుంచే భానుడి భగభగలకు పగటి ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. గాలిలో ఆర్థత పెరిగిపోయి తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మార్చి చివరి మాసంలోనే ఎండలు దంచికొట్టడంతో రాబోయే ఏప్రిల్, మే మాసాలలో పరిస్థితులు ఎలా ఉంటాయోనని? జనం బెంబెలెత్తి పోతున్నారు. శనివారం జిల్లా పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 41.0 డిగ్రీలు నమోదు కాగా, కనిష్ఠంగా 26.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని పలుచోట్ల 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గతేడు జిల్లాలో అత్యధికంగా 45.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, ఈయేడు ఎండల తీవ్రత మరింత ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. మండుతున్న ఎండలదాటికి చిరువ్యాపారులు, రైతులు, ఉపాధి కూలీలు, కార్మికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మధ్యాహ్నం సమయంలో మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు గొడుగు సహాయంతోనే బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే వేసవి పరిస్థితుల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తుండగా.. నోరు లేని మూగజీవాలు పచ్చనిచెట్లను ఆశ్రయిస్తూ సేద తీరుతున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలో మరింతగా ఎండల తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తుండగా.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే తప్ప.. బయటకు వెళ్లవద్దని జిల్లా అధికారులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శనివారం జిల్లా కలెక్టర్ పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

మార్చిలోనే మండిపోతున్న ఎండలు

పగలంతా మండిపోతున్న ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరవుతుండగా.. రాత్రి వేళల్లో తీవ్రమైన వడగాలులు ప్రభావం కనిపిస్తుంది. మార్చి నెలలోనే ఎండల తీవ్రత పెరిగిపోవడంతో నీటి జాడలు అడుగంటుతున్నాయి. భూగర్భ జలాల మట్టం వేగంగా పడిపోతుందని సంబంధిత శాఖ అధికారులు పేర్కొంటున్నారు. గత పక్షం రోజులుగా.. పెరిగిపోయిన ఎండల తీవ్రతకు విద్యుత్ వినియోగం కూడా భారీగా పెరిగి డిమాండ్ ఏర్పడుతోందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో అనాధికారికంగా విద్యుత్ కోతలను విధిస్తున్నారు. మండుతున్న ఎండలకు విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు మొరాయించడంతో వ్యవసాయంతో పాటు గృహ వినియోగం సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుంది. ముఖ్యంగా రాత్రివేళల్లో కరెంట్ కోతల కారణంగా ఉక్కపోత భరించలేక జనం అల్లాడుతున్నారు. అంతేకాకుండా ఆసుపత్రుల్లోనైతే రోగులతో ఇబ్బందులు తప్పడం లేదు. పెరిగి పోతున్న ఉష్ణోగ్రతల కారణంగానే విద్యుత్ సరఫరాలో కొంత అంతరాయం ఏర్పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఉదయం 9గంటల నుంచి 6గంటల వరకు జనం బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. దీంతో రోడ్లన్ని నిర్మాణుష్యంగా మారుతున్నాయి. వ్యాపారాలు అంతంతమాత్రంగానే కొనసాగుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లోనే పనులు ముగించుకుని ప్రజలు ఇళ్లలోకి వెళ్లిపోతున్నారు. దీంతో గిరాకీలు భారీగా పడిపోయాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత పెరిగి వడగాలుల ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు.

మార్చి 25నుంచి జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలిలా..

రోజు	గరిష్ఠం	కనిష్ఠం
మార్చి 25	39.3	25.2
మార్చి 26	39.3	24.5
మార్చి 27	39.8	24.8
మార్చి 28	40.8	25.5
మార్చి 29	40.8	26.7
మార్చి 30	41.0	26.5

గత పక్షం రోజులుగా ఎండలు దంచికొడుతున్నాయి

● మేకల సుదాం యాదవ్, రైతు, తలమడుగు



గత పక్షం రోజులుగా ముదురుతున్న ఎండలతో ఉష్ణోగ్రతలు పెరిగి పోతున్నాయి. ఉదయం 10 గంటలు దాటిందంటే.. బయటకు వెళ్లే పరిస్థితులు లేవు. ఎండల తీవ్రతకు ఉదయం, సాయంత్రం వేలల్లోనే వ్యవసాయ పనులను చేపడుతున్నాం. మధ్యాహ్నం సమయంలో విశ్రాంతి తీసుకోవాల్సి వస్తుంది. సాయంత్రం 5గంటలైన వడగాలులతో ముఖం వాడిపోయే వేడిగాలులు వీస్తున్నాయి. రాత్రంతా తీవ్రమైన ఉక్కపోతతో నిద్రరావడం లేదు. కూలర్లు ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. మధ్యాహ్నం సమయంలో చెట్ల నీడలోనే సేదతీరుతున్నాం. అయినా వడగాల్పులతో బయట ఉండలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈయేడు మార్చి నెలలోనే ఎండల తీవ్రత విపరీతంగా కనిపిస్తుంది.

సంక్షిప్త సమాచారం



బోరును పరిశీలిస్తున్న డీడీ దిలీప్‌కుమార్

ఎర్రగుట్టలో బోరు పరిశీలన

ఉట్నూర్, మార్చి 30: ఉట్నూర్ మండలంలోని ఎర్రగుట్ట గ్రామంలోపీవీటీజీ గిరిజనులు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య పరిష్కారానికి ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్త ఆదేశాల మేరకు శనివారం బోరు వేయించామని డీడీ దిలీప్‌కుమార్ తెలిపారు. పీవీటీజీ గిరిజనులు మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నామని పీఓకు తెలపడంతో అధికారులను పంపించి సమస్య తెలుసుకున్న అనంతరం గిరిజనుల కోరిక మేరకు తాగునీటి బోరు వేయడం జరిగిందన్నారు.

6న ఉట్నూర్ ఐటీడీఏ ఉద్యాన నర్సరీ పండ్ల తోటల వేలం

ఉట్నూర్, మార్చి 30: మండల కేంద్రంలోని ఐటీడీఏ పరిధిలోని ఉద్యాన నర్సరీలోని పండ్ల తోటల ఫల సాయాన్ని వేలం వేయనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త ఒక ప్రకటనలో తెలిపారు. ఉట్నూర్ ఐటీడీఏ ఉద్యాననర్సరీలో ఉన్న మామిడి, జామతోటల ఫల సాయాన్ని ఏప్రిల్ 6న ఉట్నూర్ తోటలో వేలం పాట ఉంటుందని అన్నారు. ఆసక్తి గల వ్యాపారస్థులు, సంస్థలు ఏప్రిల్ 6న మధ్యాహ్నం 3గంటలకు ఉట్నూర్ ఐటీడీఏ నర్రీలో జరిగే వేలం పాట ఓపెన్ యాక్షన్‌లో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాల కోసం ఉ ట్నూర్ ఐటీడీఏలోని ప్రాజెక్టు హార్టికల్చర్ ఆఫీసర్ సందీప్‌కుమార్‌ని లేదా ఐటీడీఏ ఉద్యాన అధికారి శ్రీసుధీర్‌కుమార్ ఫోన్ నెంబర్ 9032313933 ద్వారా సంప్రదించాలని కోరారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

నేరడిగొండ, మార్చి 30: మండల కేంద్రంలో గల శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ 8వ వార్షికోత్సవం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలో గల భక్తులు హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

రేపు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం

బోథ్, మార్చి 30: బోథ్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని ఫిబ్రవరి 1న ఇచ్చోడ మండల కేంద్రంలోని షార్ప్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి ఆడే గజేందర్ తెలిపారు సమావేశానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మంత్రి అనసూయ సీతక్క ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్, డీసీసీబీ చైర్మన్ అది భోజారెడ్డి, పలువురు నాయకులు హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గాను అన్ని మండలాల పార్టీ అధ్యక్షుడు మార్కెట్ కమిటీ చైర్మన్‌లు నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

- చివరిరోజు 10వేల 404 మంది విద్యార్థులకు గాను 10వేల 361 మంది హాజరు
- 43 మంది విద్యార్థుల గైర్హాజరు
- ఏప్రిల్ 1న వొకేషనల్ పరీక్ష కోసం 11 పరీక్షా కేంద్రాలు
- వివరాలు వెల్లడించిన డీఈవో ప్రణీత

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 30: పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఈనెల 18 నుంచి ప్రారంభమైన పరీక్షలు శనివారం చివరి పరీక్ష సాంఘికశాస్త్రంతో పూర్తయ్యాయి. జిల్లాలో 53 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్ష కొనసాగింది. ఆయా కేంద్రాల్లో ఉదయం 8గంటల 45 నిమిషాల నుంచే విద్యార్థులకు అనుమతించారు. అనంతరం విద్యార్థులను క్షుణంగా పరిశీలించిన అనంతరం లోనికి అనుమతించారు. పరీక్ష అనంతరం విద్యార్థులు కేరింతలు కొడుతూ బయటకు వచ్చారు. కాగా చివరిరోజు 10,404 మందికి గాను 10,361 మంది హాజరై 43 మంది గైర్హాజరైనట్లు డీఈవో ప్రణీత తెలిపారు. అలాగే ఏప్రిల్ 1వ తేదీన వొకేషనల్ పరీక్ష ఉంటుందని, దీని కోసం 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

ఉట్నూర్: ఈనెల 18న ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు చెదురు ముదురు సంఘటనలు మినహా శనివారం నాటికి ప్రశాంతంగా ముగిశాయి. ఉట్నూర్ మండల కేంద్రంలో పూలాజిబాబా విద్యా సంస్థల భవనంలో రెండు పరీక్ష కేంద్రాలు, గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలుపుకొని మొత్తం నాలుగు సెంటర్లలో 952 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని షైనార్టీ విద్యా సంస్థల పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడు పరీక్ష పత్రంలోని ప్రశ్నలను బయటకు తెచ్చి విద్యార్థులకు జవాబులు పంపించాడని ఉట్నూర్, హస్నాపూర్, కాగజ్‌నగర్‌లకు చెందిన ముగ్గురు సామాజిక మాధ్యమం ద్వారా షైనార్టీ పాఠశాలను అప్రతిష్ట పాలు చేయడానికి ప్రయత్నించడంతో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు విచారణలు జరిపి ముగ్గురు వ్యక్తుల పై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించిన సంఘటన ఒకటి చోటు చేసుకోగా శనివారం నాటికి పరీక్షలు ప్రశాంతంగా పూర్తి చేయగలిగారు. సోమవారం కేవలం వృత్తి విద్య పరీక్షలు రాసే విద్యార్థులకు మాత్రమే ఒక పరీక్ష ఉంటుందని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.



ఆదిలాబాద్‌లో సెంటర్‌లోంచి హుషారుగా బయటకు వస్తున్న విద్యార్థులు

నేరడిగొండ: పదవ తరగతి పరీక్షలు శనివారం ముగిశాయి. నేరడిగొండ జడ్పీఎస్ఎస్ లఖంపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో 372మంది పరీక్షలకు హాజరయ్యారు. శనివారంతో పరీక్షలు ముగియడంతో ఆనందంగా తమతమ గ్రామాలకు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఎంఈవో భూమారెడ్డి మాట్లాడుతూ వేసవి తీవ్రత ఎక్కువ ఉన్నందున విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.



ఉట్నూర్‌లో పరీక్ష సెంటర్ నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు



నేరడిగొండలో పరీక్ష కేంద్రంలోంచి హుషారుగా వస్తున్న విద్యార్థులు

వాహన తనిఖీల్లో రూ.3.77 లక్షల నగదు పట్టివేత

- వివరాలు వెల్లడించిన ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ టీం లీడర్
- పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద రూ.లక్ష పట్టుకున్న పోలీసులు

జైనథ్, మార్చి 30: మండలకేంద్రానికి దగ్గరలో ఉన్న ఆర్‌అండ్‌బి సమీపంలో ఎఫ్ఎస్‌టీ మేజిస్ట్రేట్ మండల ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ టీం లీడర్ టీ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం రూ.3లక్షల 77,500 నగదును పట్టుకున్నారు. టీం లీడర్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. షేక్‌అస్లాం అహ్మద్ ద్విచక్ర వాహనం(టీఎస్01 ఇపి 544)పై బేల నుంచి ఆదిలాబాద్‌వైపు వెళ్తున్నాడు. కాగా, స్థానిక జైనథ్ ఐబీ దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా.. రూ.3లక్షల 77,500 నగదు కనిపించడంతో ఆయనను పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఆయనపై కేసు నమోదు చేసి డబ్బులను ఆదాయపు పన్ను అధికారులకు అప్పగించారు. ఇందులో ఐఎస్‌టీ టీం అధికారి జాదవ్‌శేషరావ్, వీడీయో గ్రాఫర్ చంద్రశేఖర్, టీం కానిస్టేబుల్‌లు సి.గణేష్, ఎ.వెంకటరమణ, డ్రైవర్ జాకీర్, తదితరులు ఉన్నారు.



జైనథ్‌లో నగదును పట్టుకున్న ఎఫ్ఎస్‌టీ మేజిస్ట్రేట్ టీం అధికారులు

పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద రూ.లక్ష పట్టివేత

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం రాత్రి జైనథ్ మండల రూరల్ సీఐ ఆధ్వర్యంలో లక్ష రూపాయలను పట్టుకున్నారు. జైనథ్ రూరల్ సీఐ డి.సాయినాథ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... పోలీసు బందోబస్తు మధ్య వాహనాలను తనిఖీ చేస్తుండగా పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రకు సంబంధించిన రహమతుల్లాఖాన్ దగ్గర రూ.లక్షను పట్టుకున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధన ప్రకారం రూ.50వేలకు మించి డబ్బులు తీసుకెళ్తున్న ఆయనపై కేసు నమోదు చేశారు. లక్ష రూపాయలకు ఎలంటి రషీదు లేక పోవడంతో ఆ డబ్బులను ఎస్ఎస్‌టీ టీంకి అప్పగించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జైనథ్ మండల ఎస్సై వి.పురుషోత్తం, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం

మట్కా నిర్మూలనే లక్ష్యంగా చర్యలు : ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 30: యువత, జిల్లా ప్రజలు మట్కాపై ఆకర్షితులు కాకుండా జిల్లావ్యాప్తంగా మట్కా నిర్మూలనే లక్ష్యంగా పకడ్బందీగా చర్యలను తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం పేర్కొన్నారు. స్థానిక పోలీసు హెడ్‌క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా భీంపూర్, జైనథ్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను వెల్లడిస్తూ ఈ సంవత్సరం 12 కేసులలో 41 మంది వ్యక్తులను అరెస్టు చేసి.. వారి వద్ద నుంచి దాదాపు లక్ష రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆత్యాశకు పోయి డబ్బులను పోగొట్టుకోవద్దని యువతకు ప్రజలకు సూచించారు. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లా మహారాష్ట్రకు ఆనుకొని ఉన్నందున బోర్డర్‌కి అవతల వైపు ఉన్న నేరస్థులు జిల్లాలో తరచూ మట్కా నిర్వహించే ప్రయత్నం చేస్తున్నారని, వారిని అడ్డుకోవడంలో జిల్లా పోలీసు వ్యవస్థ ముందుందన్నారు. గత సంవత్సరం 43 కేసులను నమోదు చేసి 116 వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.6,54,660 నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందని, మట్కా నిర్వహిస్తున్న నిందితులను బైండోవర్ చేస్తూ అడ్డుకట్ట వేస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా తరచూ మట్కా నిర్వహిస్తున్న నిందితులపై పీడీ యాక్ట్ సిఫార్సు చేయబోతున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల దినచర్యపై ప్రత్యేకశ్రద్ధ కలిగి ఉండాలని, పిల్లలు ఆన్‌లైన్ మట్కాకు బానిస కాకుండా పర్యవేక్షిస్తూ ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. జైనథ్, భీంపూర్ మండలాల్లో మొత్తం 11 మందిపై కేసు నమోదు చేశామని, ఇందులో ఇద్దరు పరారీ కాగా, 9 మందిని అరెస్టు చేశామన్నారు.




ఆత్రం సుగుణకు శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీకాంత్ రెడ్డి

'అత్యధిక మెజారిటీతో గెలిపిస్తాం'

మావల, మార్చి 30: ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కలిసికట్టుగా కృషి చేస్తామని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఏఐసీసీ ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థిగా సుగుణక్క పేరును ఖరారు చేసిన సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శనివారం సుగుణక్కని కలిసిన బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పలువురు నాయకులతో కలిసి పుష్ప గుచ్ఛం అందించి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ దుర్గం రాజేశ్వర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.దామోదర్ రెడ్డిలు, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఆదివారం	సోమవారం
ఇఫ్తార్	సహర్
సా.6.34	ఉ.4.48



అసత్యం, అధర్మ కార్యాలను వదలకుండా.. అన్నపానియాలను వదిలేసి.. ఉపవాస దీక్ష పాటించడం.. అల్లాహ్‌కు ఏమాత్రం ఇష్టం ఉండదు

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.4, కనిష్ఠం 28.7



నవోదయకు 49 మంది విద్యార్థుల ఎంపిక

కుంటాల, మార్చి 31: ఆదివారం విడుదలైన జవహర్ నవోదయ విద్యాలయాల్లో మండలానికి చెందిన 49 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. మండలంలోని సృజన విద్యానిలయం నుంచి 29మంది విద్యార్థులు, శాంతి నికేతన్ విద్యానిలయం నుంచి 14మంది విద్యార్థులు, విజయసాయి స్కూల్ ఒకరు, కల్లూరులోని సాయిమోడల్ స్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులు సీట్లు సంపాదించినట్లు ఆయా పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు గంగన్న, సంతోష్, గజానన్, స్వప్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు.



భైంసా మార్కెట్లో విక్రయానికి తీసుకొచ్చిన టమాట దిగుబడులు

చేనులో ఏపుగానున్న టమాట దిగుబడులు

మార్కెట్‌లోనే రైతులు పారేసిన టమాట

టమాట రైతుల ఆశలు ఆవిరి!



- కిలో రూ.5కు పడిపోయిన టమాట ధర
- విస్తీర్ణం పెరిగినా ఫలితం శూన్యం
- అధిక ఖర్చులతో మరింత భారం
- పెట్టుబడీ రాక కుదేలు
- ధరల్లేవని చేనులోనే వదిలేస్తున్న రైతులు
- మార్కెట్‌కు తెచ్చిన పంటను ఇంటికి తీసుకెళ్లని వైనం

భైంసా, మార్చి 31: పంటనే నమ్ముకున్న రైతన్నకు కొంతకాలంగా ఏ కాలమూ కలిసిరావడం లేదు. మూడున్నరేళ్లుగా ప్రతికూల పరిస్థితులతో పంటలు పండక రైతులు కుదేలవుతున్నారు. సంప్రదాయ పంటలు వేస్తే ప్రయోజనం ఉండదని వ్యవసాయ శాస్త్రవేత్తలు పదేపదే హెచ్చరించడంతో రైతన్నలు ఈసారి వాణిజ్య పంటలవైపు మొగ్గుచూపారు. లాభాలు చూద్దామనుకుని టమాట, ఇతర కూరగాయల సాగువైపు దృష్టి కేంద్రీకరించారు. కానీ చివరకు పంట చేతికొచ్చే సమయానికి టమాటాకు ధర లేకపోవడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. పడిపోయిన ధరలతో పంటను ఏం చేయాలో అర్థం కాక జిల్లాలోని టమాట రైతులు కుంగిపోతున్నారు.

• విస్తీర్ణం పెరిగింది

వాణిజ్య పంటలపై దృష్టిపెట్టాలని వ్యవసాయ అధికారులు, నిపుణులు జిల్లా రైతులకు పదేపదే చెప్పడంతో చాలామంది రైతులు ఇతర పంటలపై దృష్టిసారించారు. దీనిలో నీరు ఒక మోస్తరు సరిపోయే టమాట సాగుతో లాభం గడించవచ్చని ఆలోచించిన రైతులు ఈ పంట సాగుకు కదిలారు. తద్వారా టమాట సాగువిస్తీర్ణం కూడా పెరిగింది. గతంలో కూరగాయల సాగులో టమాట 15శాతంగా ఉండేది. అదే నేడు 35 శాతానికి పెరిగింది. ప్రతీ సంవత్సరం జిల్లాలో 400నుంచి 450 హెక్టార్ల వరకు టమాట పంట సాగు చేస్తారు. కానీ ఈ సంవత్సరం రెట్టింపు స్థాయిలో 850 హెక్టార్ల వరకు సాగుచేశారు. గత ఏడాది ధరలు ఆశాజనకంగా ఉండటంతో పాటు వ్యవసాయాధికారులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించిన దరిమిలా టమాట సాగు విస్తీర్ణం పెరిగింది.

• పడిపోయిన ధర

సాగు పెరగడంతోపాటు దిగుబడి కూడా అధికంగా ఉండటంతో టమాట ధర ఒక్కసారిగా పడిపోయింది. గతనెల వరకు ధర ఆశాజనకంగా ఉండగా ఈనెల అరంభం నుంచి ధరలు క్రమక్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. రెండురోజులుగా భైంసామార్కెట్ పరిధిలో టమాట ధరలు పూర్తిస్థాయిలో తగ్గిపోయాయి. ప్రస్తుతం హోల్‌సెల్ మార్కెట్లో కిలో టమాట ధర రూ.5కు పడిపోయింది. ఈక్రమంలో 25కిలోల బాక్స్ రూ.125తో అమ్ముడుపోతున్నాయి దిగుబడులు అధికమొత్తంలో మార్కెట్‌కు వస్తున్న నేపథ్యంలో ధరలు తగ్గు ముఖం పడుతున్నాయని వ్యాపారవర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం లభిస్తున్న ధరలు పంటచేలలో టమాటలను తెంపెందుకు కూలీ చార్జీలు, దిగుబడులను మార్కెట్‌కు విక్రయించేందుకు తీసుకవచ్చే రవాణ చార్జీలు, తైబజారు చెల్లింపులకు కూడా సరిపోవడం లేదని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. టమాటలు తెంపడానికి ఒక్కోకూలికి రోజు రూ.300 నుంచి రూ.350 చార్జీ చెల్లిస్తుండగా ఒక్కో కూలి రోజుకు 25కిలోల సామర్థ్యం గల 15బాక్స్‌లను నింపుతున్నాడు. ఒక్కో బాక్స్‌ను మార్కెట్‌కు తీసుకొచ్చేందుకు రవాణా ఖర్చు కింద రూ15 నుంచి రూ.20 చెల్లించాల్సి వస్తోంది. ఇక తైబజార్ కింద ఒక్కో బాక్స్‌కు రూ.5 అప్పచెప్తున్నారు. ఇలా ఒక 25 కిలోల ఒకబాక్స్‌ను పంట చేల నుంచి తెంపి ఆటోలో మార్కెట్‌కు తీసుకొచ్చి తైబజార్ రుసుం చెల్లించి విక్ర యాలు చేపట్టేందుకు రూ.50 నుంచి రూ.60 వరకు వ్యయమవుతోంది. ఒక బాక్స్ వెనుక అన్నదాతలకు కేవలం రూ.60 వరకు మాత్రమే మిగులుతోంది. సాగు వ్యయ భారం పెరుగుతూ పోతుండగా మార్కెట్‌లో ధరలు అంతంత మాత్రంగానే లభ్యమవుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుకు కనీసం విత్తనాలకు పెట్టే ఖర్చు కూడా దక్కదని పరిస్థితి నెలకొంది.

• శీతల గిడ్డంగులు కరువే..

కూరగాయలు ఎక్కువగా సాగు చేసే ఇక్కడి ప్రాంతంలో శీతల గిడ్డంగులను ఏర్పాటుచేస్తే రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. జిల్లాలో టమాట, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, చిక్కుడు, బెండ, వంకాయలు, ఆకుకూరలు మెంతికూర, కొత్తిమీర పాలకూర, తోటకూర తదితరులను ఎక్కువగా సాగు చేస్తారు. ఆకుకూరలు అతిసూక్ష్మ పంటలు కావడంతో ధర ఉన్నప్పుడు చేతికి వస్తేనే ఆదాయం. లేదంటే పొలంలో లేదా చెత్తకుప్పలలో పడేయాల్సిందే. ఇక కూరగాయలు కూడా సూక్ష్మరకం పంటలు అయినా వాటిని శీతల గిడ్డంగిలో ఉంచితే ధర ఉన్న సమయంలో అమ్ముకునేందుకు వీలుపడుతుంది. టమాట, వంకాయ, చిక్కుడు, బెండ దిగుబడులకు సంవత్సరంలో 3 నుంచి 4 నెలల్లో తప్పకుండా అధికంగా ధర అందుతుంది. ఆ సమయంలో రైతులు అమ్ముకునేందుకు శీతల గిడ్డంగులు ఉపయోగపడతాయి. కానీ వాటి ఏర్పాటు గురించి అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు.

• పారేస్తున్న రైతులు..

అధిక మొత్తంలో టమాట దిగుబడులు మార్కెట్‌కు తరలివస్తున్నాయి. ఇక్కడి కూరగాయల హోల్‌సెల్ మార్కెట్ మొత్తం టమాట దిగుబడులతో నిండిపోతోంది. ఇంటికి తీసుకెళ్లేందుకు రవాణా చార్జీలు భరించలేక ఇక్కడి ప్రాంతంలోనే వదలి పెడుతున్నారు. కొంతమంది రైతులు చెత్తకుప్పల్లో పారేస్తున్నారు. ఇంకొంతమంది చేలలో తెంపకుండా తమ పశువులను అందులో మేపడానికి వదిలి పెడుతున్న పరిస్థితి నెలకొంది.

నష్టాలు తప్పేటట్లు లేవు..

• చంద్రశేఖర్, కూరగాయల రైతు, తరోడా

గతేడాది ఆశించిన ధరలు లభించడంతోపాటు ఈయేడు అధికారుల సూచనల మేరకు టమాట పంటను వేశాను. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా ధరలు మాత్రం నిరాశాజనకంగా ఉన్నాయి. ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితుల దృష్ట్యా నష్టాలు తప్పేటట్లు లేవు. వ్యయభారం ఇంతకింతకీ పెరుగగా ధరలు మాత్రం తగ్గుతూ పోతున్నాయి.

దయనీయ స్థితికి చేరుకున్నాం..

• కె.లక్ష్మణ్, కూరగాయల రైతు, మాంజ్రీ

సాగుబడిలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులతో రైతులు దయనీయ స్థితికి చేరుకున్నారు. పెట్టుబడిమాట చేతికి వచ్చుడు దేవుడెరుగు ప్రతీ ఏటా నష్టాలతో కష్టాలపాలవుతున్నాం. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసినా ప్రయోజనం లేకుండాపోయింది. టమాట ధరల తగ్గుదలతో ఆందోళన ఉన్నాం.





మాట్లాడుతున్న నాయకులు

'కాంగ్రెస్‌పై ఎమ్మెల్యే వ్యాఖ్యలు అర్థరహితం'

నిర్మల్ కల్చరల్, మార్చి31: కాంగ్రెస్ పార్టీపైనా, సీఎం రేవంత్ రెడ్డిపైనా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని టీపీసీసీ ప్రచార కమిటీ సంయుక్త కన్వీనర్ ఎంబడి రాజేశ్వర్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరుగ్యారంటీల అమలు కోసం ప్రజాపాలన నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తుంటే వాటి విలువ తెలియడం లేదని ధ్వజమెత్తారు. ప్రజలతో ఎన్నుకున్న ప్రభుత్వాన్ని పడగొడతామని అనడం హాస్యాస్పదమని, తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత నెలకు ఒకసారైనా ప్రజలకు అందుబాటులో ఉండడం లేదన్నారు. కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. జిల్లా కిసాన్‌సెల్ వైస్‌చైర్మన్ సూర్యకాంత్ కాంబ్లీ, సేవాదల్ నాయకులు కందుల రాజేశ్వర్ పాల్గొన్నారు.

లఘు చిత్రనటుడికి నంది అవార్డు


నిర్మల్, మార్చి 31: లఘుచిత్రాల్లో హీరో, విలన్, ఇతర పాత్రల్లో అద్భుతమైన నటన నటిస్తున్న షేక్ అన్సార్‌పాషాకు నంది అవార్డు లభించింది. ఇటీవల 2023 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సౌత్ ఇండియా ఐకానిక్ టీచర్‌గా అవార్డు తీసుకున్న ప్రైవేటుఉపాధ్యాయుల, పాత్రికేయులు షేకఅన్సార్ పాషాకు ఉత్తమ నటుడు, ఉత్తమ ఉపాధ్యాయునిగా నంది అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, బిర్లా ఆడిటోరియం రుద్ర స్టూడి యో ఆధ్వర్యంలో సినీ ప్రముఖులు ఈ నంది అవార్డులను అందజేయనున్నటట్లు అన్సార్ పాషా తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ముథోల్, మార్చి31: మండలంలోని తరోడగ్రామంలో ఆదివారం సాయంత్రం ముథోల్ ఎస్సై సాయికిరణ్ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. ప్రాణం ఎంతో విలువైందని, మనపై కుటుంబం ఆధారపడి ఉంటుందని ఆలోచించి హెల్మెట్, సీటుబెల్ట్ లేకుండా వాహనాలు నడపొద్దని అన్నారు. మద్యం తాగి, నిర్లక్ష్యంగా వాహనాలు నడపొద్దని అన్నారు. అలాగే సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా ప్రతీఒక్కరు నిబంధనలకు అనుగుణంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పలు సలహా, సూచనాలు అందించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు, గ్రామస్థులు, తదితరులన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

నిర్మల్ కల్చరల్, మార్చి31: ఆదర్శనగర్, సిద్దాపూర్ ప్రాంతానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకులు డి.సోమేశ్వర్ తన కార్యకర్తలతో కలిసి ఆదివారం అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువాలతో ఆయన ఆహ్వానించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చిత్తశుద్ధిగా పార్టీ కోసం పని చేస్తామని సోమేశ్వర్ తెలిపారు. శ్రీహరిరావు మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన నేతలతో శ్రీహరిరావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బాసర ఆలయంలో విజిలెన్స్ తనిఖీలు

- సెలవు దినం అయినప్పటికీ తనిఖీల్లో చేపట్టిన దేవాదాయ శాఖ విజిలెన్స్ అధికారిణి కృష్ణవేణి
- దాదాపు సుమారు 5గంటల పాటు ఆలయంలో సరుకులు, రికార్డుల పరిశీలన
- అధికారుల తీరుపై అసహనం



బాసర ఆలయ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ రాష్ట్ర విజిలెన్స్ అధికారి కృష్ణవేణి

బాసర, మార్చి 31: బాసర సరస్వతి అమ్మవారి దేవస్థానంలో దేవాదాయ శాఖ విజిలెన్స్ విభాగం ఆదివారం తనిఖీలు చేపట్టింది. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ దేవాదాయశాఖ రాష్ట్రవిజిలెన్స్ అధికారి, ఆ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ కృష్ణవేణి బాసర ఆలయానికి వచ్చి పలు రికార్డులు పరిశీలించారు. ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో 'బాసరలో భోంచేస్తున్నారు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఉదయాన్నే ఆలయానికి చేరుకున్న అధికారులు సరుకులు భద్రపరిచే సెంట్రల్ స్టోర్‌లో కొనుగోలు చేసిన సరుకులను తనిఖీ చేశారు. రికార్డులకు కొనుగోలు చేసిన వస్తువుల క్వాలిటీ, బ్రాండ్‌లు సరి చూశారు. టెండరులో ఉన్న బ్రాండ్‌లు, క్వాలిటీ కాకుండా ఇతర సరుకులు ఉన్నట్లు గుర్తించారు. అదే విధంగా రికార్డులోఉన్న సరుకులకు, స్టోర్ రూమ్‌లో ఉన్న సరుకుల నిల్వల లెక్కలకు తేడాలు ఉన్నట్లు తెలిసింది. అనంతరం కార్యాలయంలో దాదాపు 5 గంటలపాటు రికార్డులను విజిలెన్స్ అధికారి పరిశీలించారు. సరుకుల కొనుగోళ్లకు సంబంధించిన ప్రతీబిల్లును తనిఖీలు చేశారు. జాబితాలో దాదాపు 70 శాతానికి పైగా సరుకుల ధరలు మార్కెట్ రేటు కంటే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయంలో ఆలయ అధికారులపై విజిలెన్స్ అధికారి అసహనం వ్యక్తపరిచినట్లు తెలిసింది. ఎంఆర్‌పీ కూడా చూడకుండా టెండరును ఎలా నిర్ధారణ చేస్తారని ఆలయ అధికారిని ప్రశ్నించినట్లు సమాచారం. దేవాదాయ శాఖ విజిలెన్స్ అధికారులు ఆలయానికి ఆకస్మికంగా రావడంతో ఆలయ ఈవో హైదరాబాద్ నుంచి హుటాహుటిన బాసరకు చేరుకున్నారు. దేవాదాయ శాఖ విజిలెన్స్ అధికారుల నివేదిక అనంతరం తగు నిర్ణయం తీసుకోనుంది.

చలో ఢిల్లీలో పాల్గొన్న జిల్లా నేతలు

నిర్మల్ కల్చరల్, మార్చి31: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైమద్‌తోపాటు నాయకులు పాల్గొన్నారు. కేజ్రీవాల్ అక్రమ అరెస్టును ఖండిస్తూ రాంలీల మైదానంలో ప్లకార్డులను ప్రదర్శించి నిరసన తెలిపారు.

ఉరి వేసుకొని ఒకరి మృతి

కుభీర్, మార్చి 31: మండలంలోని న్యూసాప్లీకి చెందిన జంగి గంగాధర్ (45) ఆదివారం ఉదయం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం.. మృతుడు కొంతకాలంగా మద్యానికి బానిసై ఇంట్లో వచ్చి గొడవ చేసేవాడు. ఆదివారం ఉదయం మద్యం తాగి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి, మత్తు పదార్థాలకు యువత బానిసలు కావొద్దు

• ఎస్పీ జానకీ షర్మిల



మాట్లాడుతున్న జానకీ షర్మిల

నిర్మల్‌కల్చరల్, మార్చి31: యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని ఎస్పీ జానకి షర్మీల పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మీ వాడ డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి నిర్మూలనకు సమాచారం అందించి సహకరించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, అసాంఘిక కార్యక్రమాలను పోలీసులకు తెలియజేయాలన్నారు. సమాచారం అందించేవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. మోటార్ వాహనచట్టంపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురికావద్దని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎన్నికల నియామవళి, డయల్ 100, షీటీమ్స్ తదితర అంశాలపై ప్రజలకు వివరించారు. పత్రాలులేని 45మోటర్ సైకిళ్లు, 6ఆటోలు స్వాదీనం చేసుకున్నారు. కార్యక్రమంలో పట్టణసీఐ అనిల్, ఎస్సై రాజేశ్వర్‌గౌడ్, సుమలత, ఏఎస్సై బాబురావు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలి

• బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ సమన్వయ కర్తలు

భైంసా, మార్చి31: ప్రణాళికాబద్ధమైన విధానాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని బీఆర్ఎస్ సమన్వయ కర్తలకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లో ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయకర్తలు లోలం శ్యాంసుందర్, డా.కిరణ్ కోమ్రేవార్, నిర్మల్ జిల్లా ప్రతినిధి రాంకిషన్ రెడ్డిలు మాజీ మంత్రివర్యులు కేటీఆర్‌తో బేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ వచ్చేనెలలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి, విధానాలపై వారికి దిశా, నిర్దేశం చేశారు. పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు కోసం చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు అందించారు. లోపాలను సరిదిద్దుకొని పార్టీకి పూర్వవైభవం తీసుకవచ్చే దిశగా ముందుకు సాగాలని సూచించారు. స్వార్థపూరిత విధానాలతో కొంతమంది నాయకులు పార్టీని వీడినా వచ్చే నష్టమేమీలేదని అన్నారు. ఉన్నవారెవరూ అధైర్య పడొద్దని అన్నారు. కష్టకాలంలో పార్టీకి అండదండగా నిలిచిన వారిని కళ్లలో పెట్టుకొని వారికి ఉజ్వల భవిష్యత్ అందిస్తామని వెల్లడించారు.



ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న గ్రామస్థులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కుంటాల, మార్చి31: మండలంలోని అందకూర్ గ్రామంలో శ్రీమహాలక్ష్మీ, పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయాల ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షికోత్సవం పురస్కరించుకొని గ్రామస్థులు నిత్యబోనాలతో భాజా భాజంత్రీలతో ప్రధానవీధుల గుండా శోభాయాత్రగా ఆలయానికి వెళ్లారు. వేదపండితులు సదాశివ్ ఆధ్వర్యంలో అమ్మవార్లకు అభిషేకం, అర్చన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రీతిపాత్రమైన నైవేద్యాలను అమ్మవార్లకు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థికి చేయూత

ముథోల్, మార్చి 31: మండలంలోని ఆష్టా గ్రామానికి చెందిన బొడ్డు గంగాధర్‌కు చెందిన కూతురు కావ్యకి ఉన్నత చదువుల నిమిత్తం లాప్టాప్‌ను అదే గ్రామానికి చెందిన పట్టేపూర్ వినోద్‌రెడ్డి అందజేశారు. విద్యార్థిని హైదరాబాద్‌లోని గోకరాజు రంగరాజు కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతోంది. పట్టుదలతో చదివి తల్లిదండ్రుల కలను నెరవేర్చాలని సూచించారు. లాప్టాప్ అందజేసినదాతను పలువురు అభినందించారు.

మహాత్మాజ్యోతి బాపూలే దంపతుల విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ

ముథోల్, మార్చి 31: ముథోల్‌లో ఆదివారం మహాత్మాజ్యోతి బాపూలే విగ్రహాల ఏర్పాటుకమిటీ ఆధ్వర్యంలో మహాత్మాజ్యోతి బాపూలే-సావిత్రబాయిపూలే దంపతుల విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విగ్రహ కమిటీ సభ్యులు మాట్లాడుతూ భావితరాలకు మహాత్మా జ్యోతిబాపూలే సావిత్రబాయి దంపతులు ఆదర్శమని అన్నారు. సంఘ సంస్కర్తగా జ్యోతిబాపూలే దంపతులు సమాజానికి చేసిన సేవలు వెలకట్టలేనివని అన్నారు. కార్యక్రమంలో విగ్రహ కమిటీ అధ్యక్షుడు పోతన్నయాదవ్, మాజీ సర్పంచ్‌లు రాజేందర్, అనీల్, కమిటీ సభ్యులు, నాయకులు గుంజల నారాయణ, మాజీ ఎంపీపీ ఎజాజొద్దిన్, ఖాలీద్‌పటేల్, భూమేష్, రమేష్, శ్రీనివాస్‌గౌడ్, వందే మాతరం, సంజీవ్, మక్థూం, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాల ఏర్పాటుకుభూమి పూజచేస్తున్న దృశ్యం

టీవీ, సోషల్ మీడియా చానళ్లలో తప్పుడు ప్రచారం

» 10 సంస్థలకు నోటీసులు పంపా: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొన్ని టీవీ చానళ్లతోపాటు, యూట్యూబ్, సోషల్ మీడియా సంస్థలకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ లీగల్ నోటీస్‌లు పంపించారు. ఇప్పటికే పలు చానళ్లకు లీగల్ నోటీస్‌లు పంపిన కేటీఆర్.. శనివారం మరో 10 సంస్థలకు లీగల్ నోటీస్‌లు పంపించారు. తనను, తన కుటుంబాన్ని బద్నాం చేయాలనే కుట్రలో భాగంగా అసత్య ప్రచారాలు, కట్టు కథలు అల్లుతున్నాయని, అందుకే ఆయా మీడియా సంస్థలకు నోటీసులు పంపినట్లు కేటీఆర్ వెల్లడించారు. మీడియా ముసుగులో అవన్నీ కుట్ర చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఇప్పటికే కొన్ని మీడియా సంస్థలు తప్పు తెలుసుకుని వీడియోలు తీసివేసినట్లు తనకు సమాచారం అందించాయన్నారు. వారంలోగా మిగతా చానళ్ల కూడా తీసివేయాలని, లేదంటే వాటిపై చట్టప్రకారం ముందుకెళ్తామని శనివారం కేటీఆర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

» విదేశాలకు పారిపోకుండా పాస్‌పోర్టును సీజ్ చేయాలి

» హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జేఏసీ ఫిర్యాదు

హుస్నాబాద్, మార్చి 30: బీఆర్‌ఎస్ పది సంవత్సరాల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో నియోజకవర్గ జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. అవినీతికి పాల్పడిన కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు విదేశాలకు పారిపోకుండా వారి పాస్‌పోర్టులు సీజ్ చేయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సచివాలయనిర్మాణం, వరంగల్ జైలు కూల్చివేత, గొర్ల పంపిణీ, దళిత బంధు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతులు, ధరణి పేరిట భూ కబ్జాలు తదితర అంశాలపై రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.

ఏళ్లు గడిచినా గుర్తింపు లేదని..

» సీఎం నివాసం వద్ద కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

బంజారాహిల్స్, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): పార్టీలో చేరి సంవత్సరాలు గడుస్తున్నా తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఓ కాంగ్రెస్ కార్యకర్త సీఎం నివాసం వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. వరంగల్ జిల్లా భూపాలపల్లికి చెందిన కృష్ణ సాగర్ నగరంలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. కాంగ్రెస్ కార్యకర్తగానూ వ్యవహరిస్తున్నాడు. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్దకు శనివారం కారులో వచ్చాడు. సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది వారించారు. దీంతో కృష్ణ సాగర్ తనతో తెచ్చుకున్న డీజిల్ పోసుకొని నిప్పు అంటించుకుంటానంటూ బెదిరించాడు. అక్కడే ఉన్న పోలీసులు స్పందించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కృష్ణసాగర్ మాట్లాడుతూ తాను సీఎం రేవంత్‌తోపాటు టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినట్లు చెప్పాడు. పార్టీలో ఏళ్లుగా పనిచేస్తున్నా గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

జూన్ 1 నుంచి ఇంటర్ కాలేజీల ప్రారంభం

హైదరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికి (2024-25) సంబంధించిన అకడెమిక్ క్యాలెండర్‌ను ఇంటర్ బోర్డు శనివారం ప్రకటించింది. దీనిప్రకారం జూన్ 1 నుంచి కొత్త విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి. నవంబరు 18 నుంచి అర్ధ సంవత్సర పరీక్షలు, 2025 జనవరి 20 నుంచి ప్రీఫైనల్, ఫిబ్రవరి మొదటివారంలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి మొదటివారంలో వార్షిక పరీక్షలు ఉంటాయని బోర్డు తెలిపింది.

పోలీస్ టు పొలిటికల్

(మొదటి పేజీ తరువాయి)

మలుపు తిరిగింది. "సాధారణంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్పెషల్ ఆపరేషన్ బృందాలు ఎన్నికల సమయంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై దృష్టిపెడతాయి. స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పేరుతో ఈ బృందాలు తమకు వచ్చిన సమాచారం మేరకు ఏ నియోజకవర్గంలోనైనా పర్యటిస్తాయి. అనుమానితులను సోదా చేస్తాయి. వీరి వాహనాలను ఇతర తనిఖీ బృందాలు అడ్డగించవు" అని ఓ విశ్రాంత పోలీసు అధికారి వివరించారు. దీన్ని బట్టి రాధాకిషన్‌రావు తమకు ఉన్న అధికారాలను, వెసులుబాట్లను దుర్వినియోగం చేసి, డబ్బు తరలించి ఉంటారని దర్యాప్తు అధికారులు అంచనాకు వచ్చారు. ఎవరి కోసం డబ్బు తరలించారు? ఎవరికి అందజేశారు? అనే ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు విప్పితే.. రాజకీయ నాయకుల పాత్ర బయటకు వస్తుందని తెలుస్తోంది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌రావును కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని, విచారించేందుకు పంజాగుట్ట పోలీసులు సిద్ధమవుతున్నారు. ట్యాపింగ్‌తోపాటు.. నగదు తరలింపు వెనక ఉన్న రాజకీయ శక్తులెవరనేది రాధాకిషన్ విచారణలో తేలుతుందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. రాధాకిషన్‌ను ఏయే అంశాలపై ప్రశ్నించాలి? అనే దానిపై ఉన్నతాధికారుల బృందం ఇప్పటికే ఓ ప్రశ్నావళిని సిద్ధం చేసినట్లు సమాచారం. "పోలీసు వాహనాల్లో డబ్బులు తరలించాలని ఆదేశించిన నాయ



కులెవరు? ఎన్నిసార్లు నగదును తరలించారు? ఎక్కడి నుంచి ఎక్కడికి చేరవేశారు? ఎవరికి అందజేశారు? ఆ నగదును ఎక్కడి నుంచి సర్దుబాటు చేశారు? ఈ కుట్రలో ఇంకా ఎవరెవరికి భాగస్వామ్యం ఉంది?" అనే ప్రశ్నలకు రాధాకిషన్ నుంచి సమాధానాలు రాబట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు తెరిస్తే.. గత ప్రభుత్వ పెద్దలు, బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు అరెస్టయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. మనీలాండరింగ్ కోణం ఉండడంతో.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా రంగంలోకి దిగే సూచనలున్నాయి. కాగా, ఈ కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుది తొలి అరెస్టు కాగా.. ఆయనను అదే రోజు సస్పెండ్ చేశారు. అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న కూడా 48 గంటలకు మించి జైలులో ఉన్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం వారిని సస్పెండ్ అయినట్లే.! అయితే.. సోమవారం అధికారికంగా సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడతాయని డీజీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

చంచల్‌గూడ జైలుపై నిరంతర నిఘా..!

ఫోన్ ట్యాపింగ్ సంచలన కేసు కావడంతో.. నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంచల్‌గూడ జైలుపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ప్రస్తుతం భుజంగరావు, తిరుపతన్న పోలీసు కస్టడీలో ఉండగా.. ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు జైలులో ఉన్న విషయం తెలిసిందే.! దీంతో వారి బ్యారెక్‌లు, కదలికలు, ములాఖత్‌కు వస్తున్నవారిపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ఎస్‌ఐబీ నుంచి డీఎస్పీ స్థాయి నేతృత్వంలోని ఓ బృందం ఈ నిఘాను పర్యవేక్షిస్తోంది.

అదుపులో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు..?

ఈ కేసులో ఇప్పటి వరకు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్‌డీ) రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఐ న్యూస్ ఎండీ శ్రవణ్‌రావు నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే! వీరితోపాటు.. ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు కూడా పాత్రధారులేనని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ ఐదుగురిలో ఇద్దరు ఇప్పటికే విచారణకు హాజరయ్యారు. తాజాగా.. మరో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను అదుపులోకి తీసుకుని, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్లు తెలిసింది. వీరు గతంలో ఎస్‌ఐబీలో పనిచేశారా..? లేక టాస్క్‌ఫోర్స్‌లో రాధాకిషన్ టీమ్‌లో పనిచేశారా..? ఫోన్‌ట్యాపింగ్‌తో నేరుగా సంబంధం ఉందా? లేక రాధాకిషన్‌రావు ఆదేశాలతో వ్యాపారుల ప్రొఫైల్స్ తయారు చేసి, అక్రమ వసూళ్ల దందాకు పాల్పడ్డారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు.. భుజంగరావు, తిరుపతన్న కింద పనిచేసిన సిబ్బందిపైనా అధికారులు ఆరా తీస్తున్నారు.

కేకేకు బీఆర్‌ఎస్ ఏం అన్యాయం చేసింది?

» ఆయనకు రెండుసార్లు రాజ్యసభ.. కూతురికి మేయర్ పదవి ఇచ్చాం

» కష్టకాలంలో పార్టీని వీడడం దురదృష్టకరం

» కాంగ్రెస్ పాలనలో అందరికీ అన్యాయం

» ఆరు నెలల్లో అధికారం బీఆర్‌ఎస్‌దే: హరీశ్



గజ్వేల్, మార్చి 30: "బీఆర్‌ఎస్ కేశవరావు(కేకే)కు రెండుసార్లు రాజ్యసభ ఎంపీగా అవకాశమిచ్చింది. ఆయన కూతురికి మేయర్ పదవి.. కొడుక్కి కార్పొరేషన్ చైర్మన్ పదవులు కూడా ఇచ్చింది. పార్టీలో పెద్ద మనిషిగా కేకేకు కేసీఆర్ ఎప్పుడూ గౌరవం ఇచ్చే వారు. కేసీఆర్ ఆయనకు ఏం అన్యాయం చేశారు? కష్టకాలంలో పార్టీని వదిలిపోవడం దురదృష్టకరం" అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఓ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉండగా విడిచి పెట్టి వెళ్లిన వాళ్లను తర్వాత కాళ్లు మొక్కినా తీసుకోబోమని చెప్పారు. తమకు నష్టం చేసిన వారిని విడిచి పెట్టేది లేదని, లెక్కలు రాస్తున్నామని, తర్వాత వడ్డీతో సహా తీర్చుకుంటామన్నారు. రాష్ట్రంలో వంద రోజుల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆగమయ్యారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నీటి బుడగలు అని, ఉద్దెర పథకాలు మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. మళ్లా బోర్లు వేసే కాలం వచ్చిందని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, ఆరు నెలలు ఓపిక పడితే భవిష్యత్తు బీఆర్‌ఎస్‌దేనని, మళ్లీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. గజ్వేల్ అభివృద్ధిని ఓర్వలేని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌కు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్ గురించి గ్రామాల్లో చర్చ పెట్టాలని హరీశ్‌రావు సూచించారు.

అందరికీ పనులు చేశా

తాను మంత్రిగా ఉన్నప్పుడు అందరికీ అన్ని పనులు చేశానని, సమాయాభావం వల్ల కడుపు నిండా మాట్లాడలేకపోయానని, ఇక నుంచి నా ప్రాణం అడ్డం పెట్టి అయినా కార్యకర్తల వెంట ఉంటానని హరీశ్‌రావు అన్నారు. ఏప్రిల్ 2న పూర్తిస్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడుకుందామని చెప్పారు.

కామారెడ్డి మునిసిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

» చైర్‌పర్సన్ పదవిని కోల్పోయిన జాహ్నవి

» వనపర్తిలో హైడ్రామా..

బీఆర్‌ఎస్‌కు 8 మంది రాజీనామా

కామారెడ్డి/మహబూబ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి మునిసిపల్ కౌన్సిల్ పీఠాన్ని బీఆర్‌ఎస్ కోల్పోయింది. మునిసిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి 10 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలిపారు. దీంతో బీఆర్‌ఎస్ పార్టీ.. కామారెడ్డి మున్సిపాలిటీని కోల్పోవాల్సి వచ్చింది. కామారెడ్డి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై ఈనెల 11 న కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో అధికారులు శనివారం బలపరీక్ష సమావేశం నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 49 మంది సభ్యులు ఉండగా.. అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యుల అవసరం ఉంది. అయితే, శనివారం జరిగిన బలపరీక్షకు కాంగ్రెస్ పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్‌కు చెందిన 10 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం నెగ్గిందని అధికారులు ప్రకటించారు. కాగా, కాంగ్రెస్ కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానం చెల్లుబాటు కాదని పేర్కొంటూ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈనెల 12న తీర్పు వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు వనపర్తి మునిసిపాలిటీలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి షాక్ తగిలింది. కౌన్సిలర్లు ఎవరూ పార్టీని వీడొద్దన్న ఉద్దేశంతో చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో ఆయన రాజీనామా చేయించిన విషయం తెలిసిందే. అయితే, శనివారం 8 మంది కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. గత మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఐదుగురు సభ్యులు గెలువగా, ఆ తర్వాత బీజేపీ నుంచి ఇద్దరు, బీఆర్‌ఎస్ నుంచి ఇద్దరు ఆ పార్టీలో చేరారు. టీడీపీకి ఒక కౌన్సిలర్ ఉండగా ఆమె కూడా కాంగ్రెస్‌కే మద్దతు తెలుపుతున్నారు. తాజాగా 8 మంది కౌన్సిలర్ల రాజీనామాతో కాంగ్రెస్ బలం 18కి చేరనుంది. దీంతో మొత్తం 33మంది కౌన్సిలర్లున్న వనపర్తి మునిసిపల్ పీఠాన్ని కాంగ్రెస్ చేజిక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

ప్రజలు నిర్భయంగా

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఇంద్రవెల్లి, మార్చి 30: త్వరలో జరగనున్న లోక్ సభ ఎన్నికల దృష్ట్యా ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా వారిలో విశ్వాసాన్ని పెంపొందించే చర్యల్లో భాగంగా శనివారం ఇంద్రవెల్లి మండలకేంద్రంలో పెద్దసంఖ్యలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మండల కేంద్రంలో అంజి చౌరస్తా స్థానిక పోలీస్‌స్టేషన్ వరకు కేంద్ర సాయుధ బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి, ఎస్సై దుబ్బాక సునీల్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ బి.రాము పేర్కొన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని కౌటా(బి) గ్రామంతో పాటు బోథ్‌లో సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి ఎస్సై కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పజల్లో ఉన్న భయాందోళనలు తొలగిపోవాలన్న ఉద్దేశంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎలాంటి ఒత్తిళ్లకు లొంగవద్దని ఈ సందర్భంగా సూచించారు.



ఇంద్రవెల్లిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న దృశ్యం



కౌటా(బి) గ్రామంలో కవాతు చేస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

కాంగ్రెస్ పార్టీలోకి పలువురి చేరికలు

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 30: ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాసేవ భవన్‌లో సంజయ్‌నగర్ కాలనీకి చెందిన పాటిల్ భూమారెడ్డి, ఆకుర్ల గ్రామానికి చెందిన తాజామాజీ సర్పంచ్ సునిత - దిలీప్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బోథ్: మండలంలోని చింతలబోరి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. చింతలపూడి గ్రామానికి చెందిన ముండే శ్రీధర్ అంకుష్ రాజు ముచ్చెందర్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో వారిని పార్టీ కండువా కప్పి బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సాదరంగా ఆహ్వానించారు.

విద్యార్థులకు పుచ్చకాయల పంపిణీ

తాంసి, మార్చి 30: తన పంట పొలంలో పండిన మొదటి పంట కాతను విద్యార్థులకు అందించాలన్న సదుద్దేశంతో ఆ పంటను విద్యార్థులకు అందజేసి ఉదారత చాటుకున్నాడు. దీనికి సంబంధించి రైతు వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం పొన్నారి గ్రామ పాఠశాలలో 212 మంది విద్యార్థులు ఉన్నారు. అదే గ్రామానికి చెందిన ఆనంద్ అనే రైతు మూడెకరాలలో పుచ్చకాయలు సాగు చేస్తున్నాడు. అయితే ఆ పుచ్చ కాయలను శనివారం తీసి మొదటిసారి చేతుకు వచ్చిన పుచ్చకాయలను విద్యార్థులకు అందజేసి ఉదారత చాటుకున్నాడు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అశోక్, ఎంపీటీసీ రేఖ, రఘు, భోజన్న యాదవ్, తదితరులు ఉన్నారు.

మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య

ఉట్నూర్, మార్చి30: ఉట్నూర్ మండలంలోని లక్షేటిపేటకు చెందిన మేఘశం, రాంబాయి దంపతుల కుమారుడు అర్క వినోద్(24) మనస్థాపానికి గురై ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఉట్నూర్ ఎస్సై మనోహర్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన కథనం ప్రకారం వారి ఇంట్లో సోదరి వివాహం నార్నూర్ మండలంలోని భవానిగూడలో శుక్రవారం ఉండడంతో ఇంటిల్లిపాది పెళ్లికి వెళ్తూ.. వినోద్‌ను ఇంటికి కాపలాగా ఉంచి వెళ్లారని తెలిపారు. ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న వినోద్ ప్రతినిత్యం ఏదో ఆలోచిస్తూ ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరివేసుకుని మృతి చెందాడని, ఇంట్లో నుంచి వినోద్ బయటకు రావడం లేదని గమనించిన స్థానికులు ఇంటి కిటికిలో నుంచి చూడగా దూలానికి వేలాడుతు కనిపించడంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా విగత జీవిగా మారడని గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఒకపక్క కూతురు వివాహం, మరోపక్క చేతికి వచ్చిన కొడుకు మృతి చెందడంతో ఇంట్లో విషాదం నెలకొందని ఎస్సై మనోహర్ వివరించారు. శవాన్ని ఉట్నూర్ ఆసుపత్రికి శనివారం తరలించి పోస్టుమార్టం అనంతరం శవాన్ని బంధువులకు అప్పగించామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మెగాశ్యాం రాంబాబు దంపతులకు ఏడుగురు కొడుకులు కాగా ముగ్గురు కూతుళ్లు ఉన్నారని గ్రామస్థులు తెలిపారు.

ఆటలతో స్నేహభావం పెరుగుతుంది

బోథ్, మార్చి 30: క్రీడలతో స్నేహ భావం పెరగడంతో పాటుగా శారీరకంగా మానసికంగా ఉల్లాసాన్ని ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆత్రం భాస్కర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కేశవ్ గూడ గ్రామంలో గోండ్ వాన యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ క్రీడలతో ఐక్యత భావం పెరుగుతుందన్నారు. ప్రశాంత వాతావరణంలో క్రీడలు పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వజ్జర్ గ్రామ పంచాయితీ పరిధిలోని సమస్యలను పరిశీలించారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోవ లక్ష్మణ్ పటేల్ ఆత్రం జైతు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల అందజేత

బోథ్, మార్చి 30: మండలంలోని సోనాల గ్రామ ప్రాథమిక పాఠశాలలో మార్చి నెలలో నిర్వహించిన 23 పాఠశాల పని దినాలలో బడికి హాజరైన విద్యార్థులకు శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.మధుసూధన్ రిటైర్డ్ ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ చేతుల మీదుగా పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన పరీక్ష అట్టాలను పంపిణీ చేసిన రిటైర్డ్ ఉపాధ్యాయుడి సేవా దృక్పథాన్ని కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందిన విద్యార్థులకు ఉచితంగా లక్ష్మీనారాయణను అభినందించారు. ఇందులో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

బోథ్, మార్చి 30: మండల కేంద్రానికి వివిధ పనులపై వచ్చే వారి కోసం బోథ్‌కు చెందిన యువ నాయకుడు సామాజిక సేవకుడు ఇర్షద్ అలీ శనివారం బోథ్ బస్టాండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి వచ్చే వారికి తాగునీటి వసతి కల్పించాలన్న ధృక్పథంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చలివేంద్రాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.



చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న సామాజిక సేవకుడు ఇర్షద్ అలీ




ప్రధాన వీధుల గుండా సాగుతున్న ర్యాలీ

ఉట్నూర్‌లో క్రైస్తవుల ర్యాలీ

ఉట్నూర్, మార్చి 30: యూసీయూపీఏ, యూసీవైఏ క్రిస్టియన్ అధ్యక్షుడు డానియల్ ఫాస్టర్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో రన్‌ఫర్ జీసస్ ఘనంగా నిర్వహించారు. బిలీవర్స్ చర్చ్ నుంచి రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడి నుంచి తెలంగాణ చౌక్ మీదుగా మెయిన్ రోడ్డు గుండా అంబేద్కర్‌చౌక్ నుంచి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్‌చౌక్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పాత బస్టాండ్ నుంచి పోలీసు స్టేషన్ ఎమ్మార్వో ఆఫీస్ మీదుగా ఐటీడీఏ రోడ్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ఎన్టీఆర్‌చౌక్ నుంచి బెతస్థచర్చి లక్కారం వరకు రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాస్టర్లు డానియల్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి జోసెఫ్ ఫాస్టర్, బీకుమార్ ఫాస్టర్, మాజీ మహ్మద్‌ఫాస్టర్, రాజరత్నం ఫాస్టర్, శామ్యూల్‌పాస్టర్, జీవరత్నం ఫాస్టర్, ఆయా చర్చిల పాస్టర్లు, ప్రజలు పాల్గొన్నారు.





>> మాజీ మంత్రి అల్లోల మౌనంపై ఉత్కంఠ >> కాంగ్రెస్‌లో చేరికపై సందిగ్ధత >> అయోమయంలో అనుచరులు >> బయటపడని అల్లోల అంతరంగం >> ఖాళీ అవుతున్న కారు

నిర్మల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిక వ్యవహారం ఊగిసలాడుతోంది. గత పదిహేను రోజుల నుంచి ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. దీనికి అనుగుణంగానే ఆయన నిర్మల్‌లో తన అనుచరులతో మంతనాలు జరపడం అలాగే గత పదిరోజుల నుంచి ఆయన హైదరాబాద్‌లోనే మకాం వేసి చేరికపై మల్లగుల్లాలు పడుతుండడంపై అంతటా ఆసక్తి నెలకొంటోంది. అయితే కాంగ్రెస్ పార్టీలో చేరే అంశంపై ఇంద్రకరణ్‌రెడ్డి ఇప్పటి వరకు ఎక్కడా కూడా స్పష్టతనివ్వకుండా అచితూచి వ్యవహరిస్తున్నారు. ఇటీవలే బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన కీలక సమావేశానికి ఆయన గైర్హాజరయ్యారు. అలాగే ఆయనకు ముఖ్య అనుచరునిగా పేరున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు విఠల్‌రెడ్డి సైతం కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. దీనికి తోడుగా నిర్మల్‌కు చెందిన చాలా మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు వరుస కట్టి కాంగ్రెస్ పార్టీలో చేరిపోతున్నారు. ఇటీవలే నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నేరేళ్ల వేణులతో పాటు తదితరులు ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పుకున్నారు. ఇలా వరుస పెట్టి బీఆర్ఎస్ పార్టీ నేతలంతా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రమేయం లేకుండానే కాంగ్రెస్ పార్టీలో చేరుతుండడం చర్చనీయాంశంగా మారుతోంది. అయితే మొన్నటి వరకు ఇంద్రకరణ్‌రెడ్డి సన్నిహితంగా ఉన్న నాయకులంతా ఒక్కొక్కరుగా బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నప్పటికి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాత్రం మౌనంగా ఉంటుండడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటి వరకు ఇంద్రకరణ్‌రెడ్డి తన అంతరంగాన్ని మాత్రం బయట పెట్టకుండా వేచి చూసే ధోరణితో వ్యవహరిస్తుండడం ఆసక్తికరంగా మారుతోందని అంటున్నారు. ఇదిలా ఉండగా ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు అన్ని రకాల ప్రయత్నాలు సాగిస్తున్నట్లు ప్రచారం మొదలైంది. అయితే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మాత్రం ఇంద్రకరణ్‌రెడ్డి చేరిక విషయంలో ఇప్పటి వరకు స్పష్టతనివ్వలేదంటున్నారు. ఆయనపై ఉన్న ఆరోపణల నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదంటున్నారు. ఓ దశలో ఆయన చేరిక విషయంలో పార్టీ హైకమాండ్ పెద్దగా ఆసక్తిని చూపించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం రాజ్యసభ సభ్యుడైన కే.కేశవరావు వెంట ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారన్న ప్రచారం జరిగింది. అయితే కేకే వెంట ఇంద్రకరణ్‌రెడ్డి లేకపోవడంతో ఆయన అభిమానులు తీవ్రనిరాశకు లోనయ్యారు. ఈ నేపథ్యంలో ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతారో లేదోనన్న ఉత్కంఠకు ఆయన అభిమానులు లోనవుతున్నారు. మరో రెండు మూడు రోజుల్లో ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరే విషయమై స్పష్టత రావచ్చని, ఒకవేళ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకుంటే ఇంద్రకరణ్‌రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న చర్చ కూడా జోరుగా జరుగుతోంది.

బయటపడని అల్లోల అంతరంగం


ఇదిలా ఉండగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన తన అనుచరులంతా పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో వరుస కట్టి చేరుతుండడం అలాగే తన సన్నిహితుడైన పార్టీ జిల్లా అధ్యక్షులు విఠల్‌రెడ్డి సైతం తన ప్రమేయం లేకుండానే కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడం లాంటి అంశాలు ఇంద్రకరణ్‌రెడ్డిని తీవ్ర నిరుత్సాహానికి గురి చేస్తున్నాయంటున్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరిక విషయమై ఆ పార్టీ అధిష్ఠానం ఇప్పటి వరకు గ్రీన్ సిగ్నల్ జారీ చేయకపోతుండడంతో అనుచరులంతా నిరాశకు గురవుతున్నారు. అసలు హైదరాబాద్‌లో ఏమి జరుగుతుందోనన్న అంశంపై ఇక్కడి ఆయన అనుచరులు ఆసక్తికి లోనవుతున్నారు. అయితే ఓ వైపు తన అభిమానులు, అనుచరులంతా తన ప్రమేయం లేకుండానే పార్టీని వీడుతున్నప్పటికి ఇంద్రకరణ్‌రెడ్డి మాత్రం తన మౌనాన్ని వీడకుండా అంతరంగాన్ని బయట పెట్టడం లేదంటున్నారు. ప్రతీరోజూ ఆయనకు అనుచరులు, అభిమానులు ఫోన్‌లు చేస్తున్నప్పటికీ స్పష్టత రావడం లేదంటున్నారు. వేచి చూద్దామన్న సమాధానం తప్ప ఎలాంటి స్పష్టమైన సమాధానం రావడం లేదని బీఆర్ఎస్ పార్టీలోని అనుచరులు పేర్కొంటున్నారు. మంత్రి అంతరంగంపై కూడా అంతటా చర్చ జరుగుతోంది.

ఖాళీ అవుతున్న కారు

ఇదిలా ఉండగా ఇంద్రకరణ్ రెడ్డి పార్టీ మారే విషయమై ఇప్పటి వరకు స్పష్టతనివ్వకపోవడం అలాగే పార్టీ మారుతున్న వారి విషయంలో కూడా ఎలాంటి ఆటంకాలు కల్పించకపోతుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీని వీడే విషయంతో పాటు కాంగ్రెస్ పార్టీలో చేరే అంశంపై ఇంద్రకరణ్‌రెడ్డి స్పష్టతనివ్వకపోతుండడంపై కూడా పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి అసలు విషయాన్ని బయటకు చెప్పకుండా దాటవేస్తున్నారంటూ కూడా పలువురు నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా బలహీన పడిందని, ఆ పార్టీలో కొనసాగడం తమకు సాధ్యం కావడం లేదంటూ చాలా మంది సీనియర్ నాయకులు బహిరంగంగా పేర్కొంటున్నారు. ఇక తాము తాడోపేడోకు సిద్ధమవుతున్నాయని ఇంద్రకరణ్‌రెడ్డి ఏదో ఒక నిర్ణయం తీసుకోకతప్పదంటూ వారు స్పష్టం చేస్తున్నారు. ఇంద్రకరణ్ రెడ్డి పార్టీ మారిన మారకపోయిన తాము మాత్రం బీఆర్ఎస్ పార్టీని వీడడం ఖాయమని వారంతా స్పష్టమైన సంకేతాలు పంపుతున్నారు. ఇప్పటికే చాలా మంది నాయకులు మంత్రితో ఫోన్‌లో మాట్లాడుతూ తమ అభిప్రాయాలను గతానికి భిన్నంగా నిర్మోహమాటంగా వెల్లడిస్తున్నారు. అయితే అందరి అభిప్రాయాలను మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మౌనంగా వింటూనే తన అంతరంగాన్ని మాత్రం వెల్లడించడం లేదని పలువురు చెబుతున్నారు.

ఐటీ నోటీసులను వ్యతిరేకిస్తూ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన

- కాంగ్రెస్‌ను అణగదొక్కే కుట్ర
- డీసీసీ చీఫ్ కే. శ్రీహరిరావు


నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ శ్రేణుల నిరసన

నిర్మల్ కల్చరల్, మార్చి 30 : ఏఐసీసీ కార్యాలయానికి ఐటీ నోటీసులు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం నిర్మల్‌లో కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టింది. దేశవ్యాప్త నిరసనలో భాగంగా డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు నేతృత్వంలో ఆయన నివాసం నుంచి ఆర్డీవో కార్యాలయానికి ద్విచక్ర వాహనర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేశారు. శ్రీహరిరావు మాట్లాడుతూ... ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కూడా బీజేపీ ప్రభుత్వం నోటీసులు పంపడం సరికాదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని అణగదొక్కేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. ఎన్నికల్లో సీబీఐ, ఈడీ, ఇన్కమ్‌టాక్స్ శాఖలను ప్రభుత్వం ఉపయోగించుకోంటోందన్నారు. రాబోయే రోజుల్లో అధికారం కాంగ్రెస్ పార్టీదేనని, రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

సారంగాపూర్, మార్చి 30 : మండలంలోని స్వర్ణలో ముస్లిం సోదరులు ఏర్పాటు చేసినటువంటి ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు పాల్గొని ముస్లిం సోదరులకు విందు ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వర్ణలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న కూచాడి →


బీఆర్ఎస్‌కు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజీనామా

నిర్మల్ కల్చరల్, మార్చి 30 : నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తన రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు పంపినట్లు తెలిపారు. తన అభిమానులు, మద్దతుదారుల సూచన మేరకు త్వరలో డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ చేరనున్నట్లు వెల్లడించారు.

విద్యార్థులకు జీవితలక్ష్యంపై అవగాహన

నిర్మల్‌లోని డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు జీవితలక్ష్యంపై ప్రేరణాత్మక అవగాహన కల్పించారు. జాతీయ సేవా పతకం, కెరీర్ గైడెన్స్ సెల్ శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ శ్యామ్ రాథోడ్ లైఫ్ సెట్ గోల్స్, టైం మేనేజ్మెంట్ స్కిల్స్, జీవితంలోని ముఖ్యమైన సంఘటనల ప్రాధాన్యంపై ప్రసంగించారు. ప్రిన్సిపాల్ భీమ్‌రావు, శిక్షకుడు వేణుగోపాల్‌రావు, తోట లక్ష్మణ్, డా.పీజీరెడ్డి, ఆర్ నాగేశ్వరరావు, సరితారాణి, తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో అక్రమ నిర్మాణం తొలగింపు


అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న అధికారులు

నిర్మల్ కల్చరల్, మార్చి 30 : నిర్మల్ పట్టణంలో ప్రభుత్వ భూముల్లో కబ్జాలపై అధికారులు స్పందించారు. శనివారం శాంతినగర్‌లోని రైతు సహకార సంఘానికి చెందిన స్థలంలో నిర్మాణాలను అధికారులు తొలగించారు. గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ అనుచరులు కబ్జా చేసినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దృష్టికి కబ్జా విషయం చేరడంతో అధికారులను ఆయన ఆదేశించారు. కబ్జాల తొలగింపు ప్రారంభం మాత్రమే అని బీజేపీ నాయకులు అంటున్నారు.

కాంగ్రెస్ పార్టీ మామడ మండల కార్యవర్గం ఎన్నిక

మామడ, మార్చి 30 : కాంగ్రెస్ పార్టీ మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. మామడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మాజీ పీఏసీఎస్ చైర్మన్ బి. శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నల్ల లింగారెడ్డి, సెక్రటరీగా నర్సారెడ్డి, సభ్యులు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా ఎస్. తిరుమల్, ప్రధాన కార్యదర్శిగా ఎస్కే. షరీఫ్, బీసీ సెల్ అధ్యక్షుడిగా గంగాధర్, వైస్ ప్రెసిడెంట్‌గా లింగన్న ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బి. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... మాపై పూర్తి నమ్మకంతో ఏకగ్రీవంగా ప్రకటించిన డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు ఎన్నికైన వారు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రతి సామాన్య ప్రజలకు అందేలా గ్రామ గ్రామాన కాంగ్రెస్ సైనికుల్లా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సారెడ్డి, గంగాధర్, నరేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సదుపాయాలున్నాయి

- సేవలు వినియోగించుకోండి
- సూపరింటెండెంట్ డా. సునీల్ కుమార్

నిర్మల్ కల్చరల్, మార్చి 30 : జిల్లా కేంద్రప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు అన్నిరకాల సేవలు అందుబాటులో ఉన్నాయని సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో ఆర్థోపెడిక్ డాక్టర్ అరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఖరీదైన మోకాలు, తుంటి శస్త్రచికిత్సలు ఇటీవల విజయవంతంగా నిర్వహించామన్నారు. పేద ప్రజలు ఈ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. రాంపూర్ గ్రామానికి చెందిన మహిళ సట్ల పద్మకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా తుంటి ఆపరేషన్ చేశామని అన్నారు. ఖానాపూర్‌కు చెందిన మల్లమ్మకు మోకాలు నొప్పికి, మాదాపూర్ గ్రామానికి చెందిన నర్సారెడ్డికి తుంటి ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశామన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సమావేశం



కుభీర్ మార్చి 30 : మండల కేంద్రం కుభీర్‌లో శనివారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం గౌరవ అధ్యక్షులు వడ్నం నాగేశ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ స్ఫూర్తిని భావి తరాలకు తెలియజేసేందుకు ఉద్యమకారుల చరిత్ర రచన అవసరమని అందులో భాగంగానే సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సందర్భంగా రచనా కమిటీ సభ్యులు కదారి దశరథ్ మండలంలోని వివిధ గ్రామాల్లో పాల్గొన్న ఉద్యమకారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలువురు నాయకులు గత ఉద్యమ చరిత్రలో జరిగిన ఘటనల గురించి మాట్లాడారు. ఈ సమావేశంలో కుభీర్ మండల ఉద్యమకారుల అధ్యక్షులు పుప్పాల పీరాజీ, సభ్యులు పానాజీ విజయ్‌కుమార్, శివలింగం, గోరేకర్ కాశీనాథ్, బాబు, సాయిశ్యాం, దత్తాత్రి, సూది రాజన్న, గడ్డం మహేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డను ఆశీర్వదించండి .. అభివృద్ధికి అంకితమవుతా

- ఆదిలాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి అత్రం సుగుణ


భైంసా సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి అత్రం సుగుణ


కార్యకర్తలతో మాట్లాడుతున్న అభ్యర్థి అత్రం సుగుణ

భైంసా, మార్చి 30 : లోక్‌సభ ఎన్నికల్లో ఆడబిడ్డగా ఆశీర్వదించి గెలిపిస్తే అభివృద్ధికి అంకితమవుతానని ఆదిలాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిని అత్రం సుగుణ పేర్కొన్నారు. శనివారం భైంసా పట్టణంలో ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ నివాస గృహంలో జరిగిన పార్టీ ప్రతినిధులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. త్యాగాల కుటుంబీకుడైన రాహుల్‌గాంధీని ప్రధానిగా చేసేందుకు గాను తనను గెలిపించి లోక్‌సభకు పంపాలని కోరారు. పార్టీ కార్యకర్తలంతా కార్యోన్ముఖులై కాంగ్రెస్‌ను గెలిపించేందుకు కంకణబద్ధులుగా కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కనీవిని ఎరుగని రీతిలో సంక్షేమానికి, ప్రగతిబాటలు వేస్తోందన్నారు. ఇక కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెట్టింపుస్థాయిలో ప్రగతికి, సంక్షేమానికి అవకాశముంటుందన్నారు. రాజ్యాంగబద్ధ పాలనకు, ప్రజాసామ్యయుత విధానాల అమలుకు మారుపేరు కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఇలాంటి కాంగ్రెస్‌కు రాష్ట్రంలో అధికార పీఠం అప్పచెప్పిన తెలంగాణవాసులు ఇదే స్ఫూర్తిని కేంద్రంలోనూ కాంగ్రెస్‌కు అధికారాన్ని అందిచేందుకు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ సలహాలు,సూచనలు పరిగణలోకి తీసుకొని ఎన్నికల పోరును కొనసాగిస్తానని పేర్కొన్నారు. తనను గెలిపిస్తే ముథోల్ నియోజకవర్గ అభివృద్ధి ప్రత్యేకదృష్టి సారిస్తానని వెల్లడించారు. ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ మాట్లాడుతూ నియోజక వర్గ పరిధి నుంచి కాంగ్రెస్‌కు అధిక్యతను అందించి పార్టీ అభ్యర్థిని సుగుణ గెలుపులో కీలక భాగస్వామ్యాన్ని అందిస్తామని వెల్లడించారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. సమిష్టిగా కృషి చేస్తూ, సమన్వయంగా పనిచేసి పార్టీని అగ్రపథాన నిలుపుతామని స్పష్టం చేశారు. గ్రామగ్రామన విస్తృత ప్రచారాన్ని చేపట్టి పార్టీ ఇందులో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్‌చంద్రే, బెజ్జంకి ముత్యంరెడ్డి, మాజీ జడ్పీటీసీ బాశెట్టిరాజన్న, మాజీ ఎంపీపీ రాంచందర్‌రెడ్డి, నియోజక వర్గ పరిధిలోని ఏడు మండలాల, భైంసా పట్టణ కాంగ్రెస్ కమిటీల సభ్యులు, ప్రతినిధులు, ప్రధాన కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఆత్రం సుగుణ

నిర్మల్ కల్చరల్, మార్చి 30 : ఉమ్మడి ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ శనివారం నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కె.శ్రీహరిరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శ్రీహరిరావు ఆమెను సన్మానించారు. సుగుణను అభ్యర్థిగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేస్తామని ఆయన సుగుణకు హామీ ఇచ్చారు. నాయకులు ఏనుగు లింగారెడ్డి, సాగర్‌రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ప్రశాంత జీవితం గడపాలి : కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మార్చి 30 : పదవీ విరమణ పొందిన ఉద్యోగులు శేషజీవితం ప్రశాంతంగా గడపాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ ఆకాంక్షించారు. శనివారం జిల్లా ఖజానా అధికారి ప్రభాకర్‌రావు, కలెక్టరేట్ పర్యవేక్షకుడు పరిమల్ భౌమిక్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ... విధి నిర్వహణలో ప్రజల మన్ననలు పొందినవారికి నిజాయితీగా పనిచేస్తే తగిన గుర్తింపు ఉంటుందన్నారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన అధికారులను సన్మానిస్తున్న కలెక్టర్ →


ప్రజల భద్రత కోసమే కార్డన్‌సెర్చ్

- చింతల్‌భోరి గ్రామంలో ముథోల్ సీఐ శ్రీనివాస్

భైంసా రూరల్, మార్చి 30 : మండలంలోని చింతల్‌బోరి గ్రామంలో శనివారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముథోల్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రజలకు రక్షణ, భద్రతభావం కల్పించడానికి కార్డన్‌సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. గ్రామంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలన్నారు. సరైన ధ్రువపత్రాలు లేని 66 వాహనాలను సీజ్ చేశామన్నారు. ప్రతీ ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని కోరారు. తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ధ్రువ పత్రాలు లేకుండా వాహనాలు నడిపించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, కుంటాల ఎస్సై రంజిత్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


కార్డన్‌సెర్చ్ నిర్వహించి, మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

సంక్షిప్త సమాచారం

గుర్తు తెలియని ట్రాక్టర్‌ను ఢీ కొని ఒకరి మృతి


మాదరి భోజన్న మృతదేహం

నర్సాపూర్(జి), మార్చి 30 : మండలంలోని అర్లి(కె) ఎక్స్ రోడ్డు సమీపంలో శుక్రవారం రాత్రి ఏడు గంటల సమయంలో ఘోరరోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాంపూర్ నుండి ద్విచక్ర వాహనంపై మాదరి భోజన్న స్వగ్రామం లోకేశ్వరం మండలంలోని బాగాపూర్ వెళ్తుండగా అర్లి(కె) ఎక్స్‌రోడ్డు సమీపంలో గుర్తు తెలియని ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలు అయ్యాయి. 108లో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మరణించినట్లు డ్యూటీ డాక్టర్ తెలపడంతో భార్య మదరి సునీత శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు.

కాల్వ దేవస్థానం పూజ సామాగ్రి దుకాణం వేలం

దిలావర్‌పూర్, మార్చి 30 : మండలంలోని శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం పూజ సామాగ్రి దుకాణాన్ని ఒక సంవత్సర కాలానికి శనివారం వేలం వేశారు. ఈ వేలంపాటలో ముగ్గురు పాల్గొన్నారు. చివరికి కాల్వ గ్రామానికి చెందిన ముష్టి వెంకటరమణ రూ.మూడు లక్షలకు పాడి దుకాణాన్ని దక్కించుకున్నారు. ఇది గత ఏడాది కంటే రూ.87 వేలు అదనంగా వచ్చినట్లు దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రంగు రవికిషన్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఉజరం మహేష్, పాలకవర్గం సభ్యులు నర్సయ్య, దేవస్థానం రికార్డు అసిస్టెంట్‌లు కేశవ్, మాధవరావు పటేల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిర్మల్ కల్చరల్, మార్చి 30 : నిర్మల్ పట్టణం బంగల్‌పేట్, టౌన్ 2 ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 నుండి 10 వరకు బుధవార్‌పేట్, బాగులవాడ, చిక్కడ్‌పల్లి, పాన్‌గల్లీ, కబుతర్ కమాన్, గాంధీనగర్, మోచిగల్లీ, కళానగర్, ప్రియదర్శిని నగర్ ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోతుందన్నారు.

డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు



నిర్మల్ కల్చరల్, మార్చి 30 : రాష్ట్రంలోని రేషన్‌డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు హామీ ఇచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. నూతన ప్రభుత్వం దృష్టికి గౌరవవేతనం, కమీషన్ పెంపు, ఇన్సూరెన్స్ హమాలీ చార్జీల చెల్లింపు తదితర వాటిని సాధించుకుందామన్నారు. జిల్లా అధ్యక్షుడు పతికే రాజేందర్, ప్రధాన కార్యదర్శి షైక్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.